



సోమశిలలో 25.716 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జనవరి 31: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి జలాశయంలో 25.716 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నిన్న గోప్యత... నేడు హడావిడి !

- అసైన్‌మెంట్ పట్టాల వ్యవహారంలో అవకతవకలు ?
- గ్రామసభలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక
- పట్టాలు కూడా పంపిణీ
- గ్రామసభలు పెట్టినట్టు చూపే ప్రయత్నం
- వైసీపీ నాయకుల ద్వారా సంతకాల సేకరణ
- భవిష్యత్‌లో విచారణ జరిగితే ఇరుక్కుంటామనే...?

నెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే అందులో పారదర్శక ఎంత అన్నదే అసలు ప్రశ్న. గ్రామసభలు పెట్టడం, లేదా లబ్ధిదారుల జాబితాను స్థానికంగా బహిర్గతం చేయడం వంటివి చేయలేదు. ఈ క్రమంలో జిల్లాలో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయని మొదటి నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనర్హులకు కూడా భూమిని కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఎమ్మెల్యేలు చెబుతున్న లెక్కలకు, అధికారులు చెబుతున్న లెక్కలకు పొంతన ఉండడం లేదు. దీంతో అసైన్‌మెంట్ లబ్ధిదారుల జాబితాపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయినా ఉన్నతాధికారులెవరూ ఈ ఆరోపణలపై స్పందించలేదు.

● జరగపోయినా జరిగినట్లు...

గ్రామసభలు పెట్టకుండా లబ్ధిదారుల జాబితాను తయారు చేయడం నిబంధనలకు విరుద్ధం.దీంతో ఇప్పుడు తహసీల్దార్లు హడావిడిగా గ్రామసభలు పెట్టినట్లు చూపించే ప్రయత్నాలు చేస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేయడం, వారికి పట్టాలు పంపిణీ చేయడం జరిగిపోయాక భవిష్యత్‌లో వచ్చే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని వారు ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారి అసైన్‌మెంట్ జాబితా తయారీపై విచారణ జరిపితే ఇరుక్కుంటామని వారు భయపడుతున్నట్లు సమాచారం. గ్రామసభలు పెట్టకపో వడమే తప్పయితే ఇప్పుడు పెట్టకుండానే పెట్టినట్లుగా చూపించే ప్రయత్నాలు జరుగుతుండడం మరో పెద్ద తప్పు అని రెవెన్యూ వర్గాలే చర్చించుకుంటున్నాయి. గ్రామాల్లోని వైసీపీ నాయకుల ద్వారా ఆ గ్రామంలో గ్రామసభ పెట్టినట్లుగా పలువురి సంతకాలు సేకరిస్తు న్నట్లు తెలిసింది. వారితో పాటు స్థానిక సర్పంచి ద్వారా తీర్మానం తీసుకొని అంతా పారదర్శకంగా జరిగినట్లు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నెల 31 నాటికి తహసీల్దార్ల బదిలీ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లు తప్పులు చేసేందుకు భయపడతారు. దీంతో గత పది రోజులుగా పలు మండలాల్లోని తహసీల్దార్లు గ్రామసభలు పెట్టినట్లు సంతకాల సేకరణ పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది.



● గ్రామసభలతోనే పారదర్శకత

అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ గత నవంబరు నుంచి ప్రారంభమైంది. అంతకుముందు ఆరు నెలల నుంచే అర్హుల జాబితా సిద్ధం చేయడం మొదలైంది. మూడు వర్గాల వారికి పట్టాలు పంపిణీ చేశారు. భూమి లేని నిరుపేదలు ఎవరైతే ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారో వారితోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయడం మొదటిది. ఇనాం భూములను సాగు చేసుకుంటున్న కులవృత్తుల వారికి పట్టాలు అందించడం రెండోది. ఇక ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది ఇరవైఏళ్ల పూర్తి చేసుకున్నారో వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తూ ఒరిజినల్ పట్టాలు పంపిణీ చేయడం మూడోది. ఇలా ఈ మూడు విభాగాల్లో సుమారు 40 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందులో మొదటి విడతలో కొత్తగా 4,313 ఎకరాల్లో అసైన్‌మెంట్ పట్టాలను 4,017 మందికి అందించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ మొత్తంలో అత్యధికంగా సర్వేపల్లి నియోజకవర్గంలోనే లబ్ధిదారులున్నారు. నిబంధనల ప్రకారం భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలంటే ముందుగా గ్రామసభలు నిర్వహించాలి. ఆ గ్రామంలోని భూమిని తొలుత ఆ గ్రామంలోని భూమిలేని వారికి పంపిణీ చేయాలి. వారికిపోను మిగిలితేనే ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాలి. అలానే భూమి ఉన్న వారికి కొత్తగా భూమి ఇవ్వకూడదు. గ్రామసభలు పెట్టి దరఖాస్తుదారుల వివరాలను ప్రజలకు తెలియజేస్తే వారు అసైన్‌మెంట్ పట్టాలకు అర్హులా.. కాదా.. అన్నది వారు తెలియజేస్తారు. గతంలో అసైన్‌మెంట్ పట్టాలు పొందిన వారే ఇప్పుడు ఆ భూమిని సాగు చేసుకుంటారా.. లేదా.. ? అన్నది తెలుస్తుంది. అప్పుడు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. కానీ గ్రామసభలు పెట్టకపోవడంతో ఎవరికి భూములు పంపిణీ చేశారన్న విషయం స్థానికులకు తెలియడం లేదు. అయితే చాలా చోట్ల ఇతర ప్రాంతాల వారికి, భూమి ఉన్న వారికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఇక రెండో విడత కింద మరికొంతమందితో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదించారు. అయితే అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు ఎక్కడా కూడా ప్రత్యక్షంగా జరగకపోవడం గమనార్హం.



ఉలవపాడు, జనవరి 31: "పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం ఎలాంటి బాధలను, కష్టాలను అనుభవిస్తుందో తెలుసు.. మీరు అధైర్యపడొద్దు.. ధైర్యంగా ఉండండి.. మీ కుటుంబాలకు అన్నివిధాలా టీడీపీ అండగా ఉంటుంది.. మనమంతా కుటుంబ సభ్యులమే.. చంద్రబాబు మాటగా చెప్పమన్నారు"... అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆమె ఉలవపాడు మండలంలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్తాపంతో గుండె ఆగి చనిపోయిన కరేడు పంచాయతీ పరిధి టెంకాయచెట్లపాలెం మత్స్యకార కుటుంబానికి చెందిన వాయిల సుందరరావు కుటుంబ సభ్యులను తొలుత పరామర్శించారు. మృతుడి భార్య పద్మ, ఐదేళ్ల కుమారుడు గోవర్ధన్, తల్లిదండ్రులను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బడిఈడు రాగానే పిల్లవాడి చదువు బాధ్యతను పార్టీ చూసుకుంటుందని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని చెప్పి రూ. 3 లక్షల చెక్కును వారికి అందచేశారు.

టెంకాయచెట్లపాలెంలో సుందరరావు భార్యాపిల్లలను ఓదారుస్తూ...

ధైర్యంగా ఉండండి..
పార్టీ అండగా ఉంటుంది !

- చంద్రబాబు మాటగా చెప్పమన్నారు...
- ఏ కష్టం వచ్చినా మా దగ్గరకు రావొచ్చు !
- బాబు అరెస్టుతో మరణించిన వారి కుటుంబాలకు భువనేశ్వరి భరోసా
- నేడు గుడ్లూరు, కొండాపురం మండలాల్లో పర్యటన

● పింఛన్ ఇప్పించండి

తనకు ఓ కన్ను కనపడదని, పింఛను ఇవ్వడం లేదని, టీడీపీ ప్రభుత్వం వస్తే పింఛను ఇప్పించాలని మృతుడి సుందరరావు తల్లి భువనేశ్వరిని కోరారు. రాబోయే మన ప్రభుత్వంలో తప్పకుండా పింఛన్ తీసుకుంటారని ఆమె భరోసా ఇచ్చారు. భువనేశ్వరిని చూడటానికి వచ్చిన మండల ప్రజలకు ఆమె అభివాదం చేయగా.. జై టీడీపీ, జై చంద్రబాబు.. అంటూ నినాదాలతో హోరెత్తిం చారు. అనంతరం ఆత్మకూరు ఎస్సీ కాలనీకి చెందిన ఎండ్లూరి చినకోటయ్య కుటుంబాన్ని పరామర్శిం చారు. కుటుంబ సభ్యులను ఆప్యా యంగా దగ్గరకు తీసుకొని ముచ్చటిం చారు. చినకోటయ్య భార్య యలమంద మ్మకు రూ.3 లక్షల చెక్కును అంద చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ సమస్యలను ఆమెకు చెప్పుకున్నారు. స్పందించిన భువనేశ్వరి "మీకున్న సమస్యలు ఒక కాగితంపై రాసి మీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుకు ఇవ్వండి. పార్టీ అండగా ఉంటుంది' ..అని వారికి భరోసా ఇచ్చారు.

● ఘన స్వాగతం

తొలుత సింగరాయకొండ బైపాస్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భువనేశ్వరి రాకకోసం ఎదురు చూడగా, సాయంత్రం 5.45 గంటలకు ఆమె చేరుకున్నారు. కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో ర్యాలీగా ఆయా గ్రామాలకు బయలుదేరారు. దారి పొడవున గ్రామాల్లో భువనేశ్వరిని చూసేందుకు, ఆమెతో సెల్ఫీ దిగేందుకు మహిళలు పోటీ పట్టారు. ఆమె వెంట నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, ఉన్నం నళినిదేవి తదితరులు ఉన్నారు.



ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామ ఎస్సీ కాలనీలో మృతుడు ఎండ్లూరి చినకోటయ్య భార్య యలమందమ్మకు రూ. 3లక్షల చెక్కును అందిస్తున్న నారా భువనేశ్వరి



టెంకాయచెట్లపాలెంలో విక్టరీ సింబల్ చూపుతున్న భువనేశ్వరి

కందుకూరులో రాత్రి బస

కందుకూరు, జనవరి 31: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం రాత్రి కందుకూరు సమీపంలోని ఆలావారి కల్యాణ మండపంలో బసచేశారు. ఉలవపాడు మండలంలో పర్యటన అనంతరం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఆమె ఆలావారి కల్యాణ మండపానికి చేరుకున్నారు. బసకు సిద్ధంగా ఉంచిన బస్సులోకి వెళ్లారు. కాగా గురువారం ఉదయం గుడ్లూరు, కొండాపురం మండలాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు.



మార్గమధ్యంలో విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న నారా భువనేశ్వరి



ఉలవపాడు మండలం కరేడు ర్యాంపు వద్ద భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

గడప గడపకు.. పనులకు బిల్లులేవి ?

- వర్కులు చేయాల్సిందేనని ఎమ్మెల్యే ఒత్తిడి
- ముందుకురాని కాంట్రాక్టర్లు
- అయోమయంలో అధికారులు

కావలి, జనవరి 31: కావలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు చేయించడం అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. నిధులు త్వరగా వస్తాయనే నమ్మకంతో తొలుత కొన్ని పనులు పూర్తి చేసినా ఇంకా ఆ బిల్లులు కాంట్రాక్టర్ల చేతికి అందలేదు. దీంతో మలివిడత పనులకు వారు వెనుకంజ వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ వస్తుందనే ప్రచారం జరుగుతుండటం, ఈలోపు అధికారుల బదిలీలు ఉండడంతో పనులు చేసి బిల్లులు ఆగిపోతే ఎలా ? అనే ఆందోళనతో కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదు. అయితే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తన అనుచరులతో కలిసి ఇటీవల మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గడప గడపకు కార్యక్రమంలో మంజూరైన పనులను ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాల్సిందేనని ఆ సమావేశంలో ఆదేశాలు ఇచ్చారు. చేసిన పనులకు చేసినట్లు బిల్లులు పెడితే వాటిని వెంటనే ఇప్పిస్తానని కూడా హామీ ఇచ్చారు. దీంతో అధికా రులు క్వాలిటీ కంట్రోల్ చెకింగ్ లేకుండా, నాణ్యతను పరిశీలించకుండానే కావలి మున్సిపా లిటీలో పూర్తి చేసిన పనులకు బిల్లులు పెట్టారు. వాటిని ప్రభుత్వానికి అందచేసినా ఇంతవరకు నిధులు రాలేదు. దీంతో మలివిడత పనులు చేసినా బిల్లులు వస్తాయో... రావోనన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదు. కొందరు వైసీపీ నేతలు తమకు అనుకూలురైన ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో అయితేనే తాము పనులు చేస్తామని చెబుతుండగా, అది వీలు పడదని సంబంధిత అధికారులు అంటున్నారు. కాగా ఎన్నికల తరువాత ప్రభుత్వం మారితే పరిస్థితి ఏమిటన్నది కూడా కాంట్రాక్టర్లు బేరీజు వేస్తున్నారు.

● కావలికి రూ.11.20 కోట్లు

గడప గడపకు మన ప్రభుత్వం కింద కావలి మున్సిపాలిటీ పరిధిలోని 28 సచివాలయాలకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున మొత్తం రూ11.20 కోట్లు మంజూరు చేశారు. మున్సిపాలిటీలో అత్యవసరమైన 239 పనులు గుర్తించారు. వాటిలో ఇప్పటికి 24 పనులకు అనుమతులు లభించాయి. తొలివిడతగా రూ.1.84 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా, వాటికి ప్రభుత్వం రూ.86 లక్షలు విడుదల చేసింది. వాటి బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా ఇంకా కాంట్రాక్టర్లకు నిధులు అందలేదు. మరో రూ.2 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరికొన్ని పనులు టెండర్ల దశలో ఉన్నాయి. అయితే ప్రస్తుతం చేసిన పనులకే బిల్లులు రాకపోవటంతో కొత్త పనులు ఎప్పుడు చేయాలి ? వాటికి బిల్లులు ఎప్పుడు వస్తాయి ? ఒకవేళ ప్రభుత్వం మారితే మన పరిస్థితి ఏమిటి ? అనే ఆందోళనలో కాంట్రా క్టర్లు, వైసీపీ నాయకులు ఎవరూ సాహసం చేయటం లేదు. దీంతో గడప గడపకు పనులు ఈ ప్రభుత్వ హయాంలో పూర్తి చేయటం సాధ్యమేనా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గడప గడపకు.. కార్యక్రమంలో భాగంగా కావలి కనకదుర్గమ్మ గుడివీధిలో వేసిన సీసీ రోడ్డు

'ఆసరా'పై నిరాసక్తి

- సభ నుంచి వెనుతిరిగిన పొదుపు మహిళలు
- అడ్డుకున్న వీఏవోలు
- బతిమలాడుకున్న వెలుగు సిబ్బంది
- మరికొందరి బెదిరింపు

సీతారామపురం, జనవరి 31: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో బుధవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రెండు రోజులుగా సంఘ బంధం కార్యాలయ సీసీలు, వీవోఏలు మండలంలో తిరిగి పొదుపు మహిళలంతా సమావేశా నికి రావాలని ఒత్తిడి తెచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఉంటుందని, 12 గంటలలోపే అందరిని తరలించారు. రెండుగంటలకు రావాల్సిన రాజగోపాల్‌రెడ్డి నాలుగు గంటలకు వచ్చారు. దీంతో పొదుపు మహిళలు అసహనానికి గురయ్యారు. సమావేశం ప్రారంభమైన 10 నిమిషాల నుంచే అందరూ వెనుతిరగడం మొదలు పెట్టారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడక ముందే సగంమంది మహిళలు వెళ్లిపోయారు. దీంతో ఆయన అధికారులపై అసహనం ప్రదర్శించారు. కాగా సమావేశం నుంచి వెళుతున్న పొదుపు మహిళలను వీఏవోలు అడ్డుకున్నారు. అదే సమయంలో వెలుగు సిబ్బంది కూడా వారిని బతిమలాడుకోవడం కనిపించింది. 'మీరు సమావేశం నుంచి వెళ్లిపోతే రుణమాఫీ మంజూరు సమయంలో సంతకాలు పెట్టం... అంటూ మరి కొందరు బెదిరింపులకు దిగారు. మొత్తం మీద ఆసరా చెక్కుల కార్యక్రమంపై పొదుపు మహిళలు ఆసక్తి కనబరచపోవడం చర్చకు దారితీసింది.



పొదుపు మహిళలను అడ్డుకున్న వీవోఏలు



సభలో కూర్చోమని బతిమలాడుతున్న వెలుగు సిబ్బంది

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

నెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు పోస్టుల్లో అధికారులను నియమించింది. తిరుపతి ఏపీఐఐసీలో పనిచేస్తున్న ఎం. శ్రీనివాసులును టీజీపీ రాపూరు యూనిట్ ఎస్‌డీసీగా బదిలీ చేసిన ప్రభుత్వం, ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన సీహెచ్ పద్మావతిని సివిల్ సప్లయాస్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది.

● తహసీల్దార్‌లు...

నెల్లూరు(హరనాథపురం) : జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తూ అదనపు సీసీఎల్‌ఏ, కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన తహసీల్దార్లలో టీ. శ్రీనివాసులు, ఎస్‌కేఎండీ హుస్సేన్, ఎస్.రామ్మోహన్, పీ హేమంత్‌కుమార్, కే చంద్రశేఖర్, డీ శ్రీరామకృష్ణ, ఏవీ రమణరావు, వై. నాగరాజు, పీ. లక్ష్మీనరసింహం, చొప్పా రవీంద్రబాబు, ఎప్. శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రావు, ఏ నిర్మలానందబాబా, సీహెచ్ సుబ్బయ్య, ఎం.పద్మజ, వీ. లావణ్య, ఈ.రమాదేవి, వీ సుధీర్, బీ సోమ్లానాయక్, కే రాజ్యలక్ష్మి, ఆర్ సూర్యనారాయణసింగ్, సుందరమ్మ, షేక్ షఫీమాలిక్, టీ విజయకుమార్, జీ రాఘవేంద్రరావు, పీ శాంతకుమారి, పీ శ్యామలమ్మ, కే స్ఫూర్తి, పీ విజయకుమార్, ఎం.సుభద్ర, పీ. అనురాధ, పీ గీతావాణి, ఎస్.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్ఐలకు స్థానచలనం

నెల్లూరు(క్రైం), జనవరి 31: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో పనిచేస్తున్న పలువురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐలు)ను బదిలీ చూస్తూ బుధవారం రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా నుంచి ముగ్గురు ఆర్ఐలు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి నలుగురు ఆర్ఐలకు జిల్లాకు రానున్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
డి శ్రీనివాసరెడ్డి	నెల్లూరు	బాపట్ల
షేక్ మౌలుద్దీన్	నెల్లూరు	బాపట్ల
వై పౌల్‌రాజు	నెల్లూరు	తూర్పుగోదావరి
కె హరిబాబు	పీఎస్‌డబ్ల్యూ విజయవాడ	నెల్లూరు
జే రాజారావు	గుంటూరు	నెల్లూరు
కె థామస్‌రెడ్డి	గుంటూరు	నెల్లూరు
కె నాగరాజు	సీఏఆర్ విజయవాడ	నెల్లూరు

పోలింగ్ ఏజెంట్లను నియమించుకోండి

- రాజకీయ పార్టీలతో కలెక్టర్



నెల్లూరు (హరనాథపురం), జనవరి 31: రాజకీయ పార్టీల వారు పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2,317 పోలింగ్ స్టేషన్లకు 2,317 మంది బీఎల్‌వోలను, 232 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్ల తుది జాబితాపై వస్తున్న ఫిర్యాదులను ఈసీ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీ నేత వై. మురళీరెడ్డి, టీడీపీ నాయకుడు ఎస్కే. రసూల్, బీజేపీ నేత బీ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకుడు బాల సుధాకర్, సీపీఎం నేత దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థిక నష్టంతో తీవ్ర ఇబ్బందులు
- రిలే నిరాహార దీక్షలో యూటీఎఫ్ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (విద్య), జనవరి 31 : ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని యూటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన ఆర్థిక బకాయిలు విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన సమయంలో బుద్ధి చెబుతామని ధ్వజమెత్తారు. దీనిపై కలెక్టరేట్ ఎదుట బుధవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. నాలుగురోజులు జరిగే ఈ దీక్షల తొలిరోజున మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పరిష్క రించేందుకు విముఖత చూపడంతోనే బకాయిలన్నీ పెండింగ్‌లో ఉంచారన్నారు. ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకమవడంతోపాటు మిగిలిన అన్ని ఉద్యోగ సంఘాలను కూడా కలుపుకుని రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వర రావు మాట్లాడుతూ అధికారం కోసం గత ఎన్నికలకు ముందు హామీలిచ్చిన జగన్ ఆ తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేశారని విమర్శించారు. పాఠశాలల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను దెబ్బతీశారన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని వాగ్దానం చేసి కుట్రపూరితంగా జీపీఎస్ తెచ్చారని ఆరోపించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలన్నీ నాలుగు రోజుల్లో చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మరో పోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పీ బాబురెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, ఉపాధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి ఏ మురళీధర్‌రావు, కార్యదర్శులు మధుసూదన్‌రావు, సురేంద్రబాబు, దయాకర్ పాల్గొన్నారు. కాగా, యూటీఎఫ్ రిలే నిరాహార దీక్షలకు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మద్దతు తెలిపారు.

జగనన్నా నీకిది తగునా ?

- సోమశిల పనులకు నిధులేవి ?
- ఎమర్జెన్సీ వర్కుల్లోనూ జాప్యం
- ప్రశ్నార్థకమవుతున్న ప్రాజెక్టు మనుగడ
- ఆందోళనలో జిల్లా రైతులు

అనంతసాగరం, జనవరి 31: కట్టడాలు దెబ్బతిని సోమశిల ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకమవుతున్నా, అత్యవసర పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై జిల్లా రైతాంగంలో ఆందోళన నెలకొంది. నిధులు విడుదల చేయక.. ఏడాదిగా పనులు ఆగడంతో కట్టడాల మనుగడ ప్రశ్నార్థకమవుతున్న తీరు నిపుణులకు సైతం విస్మయానికి గురిచేస్తోంది. ఒక వైపు ఎన్నికలు సమీపిస్తున్నా, నిధులు మంజూరు చేయడంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి చూపుతున్న నిర్లక్ష్యాన్ని రైతులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

రెండేళ్లుగా వరద

గత మూడేళ్ల కాలంలో సోమశిలకు వరుసగా రెండేళ్లు భారీవర్షాలతో వరద పోటెత్తింది. దీంతో జలాశయం ముందు ఆప్రాన్‌తో పాటు డౌన్‌స్ట్రీమ్, ప్రొటెక్షన్ వాల్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పనులన్నీ అత్యవసరంగా చేయాల్సి ఉంది. అయితే పనుల పూర్తికి ప్రభుత్వం ప్రణాళిక చేసి రూ. 117 కోట్లతో టెండర్లు పిలిచి, చివరగా రూ.99.11 కోట్లతో పనులు ముంగిచేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం పనులు ప్రారంభమవగా చేసిన పనులకు నిధులు ఇవ్వకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఈక్రమంలో ఎక్కడ అభివృద్ధి అక్కడే అన్నతీరుతో పనులు ఆగాయి. ఈనేపథ్యంలో ప్రాజెక్టు కట్టడాల పటిష్టతపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. అత్యవసరంగా చేయాల్సిన అభివృద్ధి ప్రభుత్వం విస్మరించడంపై జగనన్న నీకు ఇది తగునా ? అంటూ జిల్లా రైతాంగం విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. 30శాతం పనులు మాత్రం పూర్తికాగా, ఇంకా 70 శాతం పనులు చేయాల్సి ఉంది. అయినా ప్రభుత్వ యంత్రాగం దృష్టిసారించకపోవడంపై వైసీపీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



నిధులు విడుదల కాక ఆగిన ఆప్రాన్ పనులు

డిజైనింగ్ మార్పు ఏది ?

సోమశిల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో లోపాలు జరిగినట్లు నిపుణులు గుర్తించారు. రీడిజైనింగ్‌తో కట్టడాలు కొంతమేరకు సరిచేయాల్సి ఉంది. అయితే ఏడాదిగా అదిశగా చర్యలు లేవు. 1, 2, 3 క్రస్ట్‌గే ట్లకు ఎదురుగా ప్రొటెక్షన్‌వాల్ నిర్మించారు. ఈ మూడు గేట్లతో నీరు దిగువకు వదిలిన సందర్భంలో నీటి ప్రవాహం ఒత్తిడి పొటె క్షన్ వాల్‌పై పడుతోంది. సాంకేతిక లోపాలు గుర్తించి కొంత కాలంగా ఈ మూడు గేట్ల గుండా నీరు కిందకు వదలకుండా ఇంజనీర్లు జాగ్రత్త వహిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప 1, 2 ,3 గేట్లు ఎత్తని పరిస్థితి ఉంది. ఈసమస్యను పరిష్కరించేలా ప్రొటెక్షన్‌వాల్‌ను సరిచేయాల్సి ఉంది. కాగా ఆదిశగా ఇంత వరకు ప్రణాళికలే రూపొందించలేదు.

అప్రంటీస్ విధానం అన్యాయం

- ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ

నెల్లూరు (విద్య), జనవరి 31 : అనేక ఉద్యమాలు, సమ్మెల ద్వారా సాధించుకున్న అప్రంటీస్ విధానం రద్దును ఈ ప్రభుత్వం తిరిగి తీసుకురావడం అన్యాయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఏ సురేంద్రరెడ్డి, ఎం పిచ్చి బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అనే క ఉద్యమాలతో అప్రంటీస్ విధానాన్ని రద్దుతోపాటు అప్రం టీస్ కాలానికి ఇంక్రిమెంట్లు సాధించుకున్నారన్నారు. ఎవరూ అడ గకుండానే ఉద్యోగ విరమణ వయసును పెం చడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగితను పెంచి పోషి స్తోందని విమర్శించారు. 35వేల ఉపాధ్యాయ పోస్టులకు గాను కేవలం 6,100 పోస్టుల భర్తీకి ఆమోదం తెలియచేసి గౌరవవేతనం విధానాన్ని తెరపైకి తేవడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో విఫల మైన 3, 4, 5 తరగతుల తరలింపు జీవో 117ను రద్దు చేయాలని, పీఆర్‌సీ కమిటీని విధుల్లో చేరేలా చూడాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

- ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం సరికాదని పీఆర్‌టీ యూ జిల్లా అధ్యక్ష ప్రధా న కార్యదర్శులు డీ వెంకటరాజు, నాటకం తిరుమలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన వెట్టిచాకిరీ వంటి అప్రంటీస్ విధా నాన్ని అనేక పోరాటాలతో రద్దు చేయిం చామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కుట్ర పన్నుతోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

కంటైనర్ టెర్మినల్‌ను కాపాడుకుంటాం

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సోమిరెడ్డి




కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సోమిరెడ్డి, ఇతర నాయకులు

నెల్లూరు (హరనాథపురం), జనవరి 31 : అన్ని పార్టీలతో కలిసి కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను కాపాడుకుంటామని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కంటైనర్లలో పనిచేస్తున్న వారితో కలిసి బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ కోసం సీపీఎం, సీపీఐ, జనసేన పార్టీలతో కలిసి పోరాటానికి టీడీపీ సిద్ధమని చెప్పారు. పోర్టులో అడ్డగోలుగా పన్ను వసూలు చేస్తున్న టోల్‌గేట్‌ను అవసరమైతే ధ్వంసం చేస్తామన్నారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోతే పోర్టు కోసం భూములిచ్చిన రైతులకు బూడిదే మిగులుతుందన్నారు. ఇప్పటికే పోర్టును మూసేస్తున్నట్లు ఆన్‌లైన్ సందేశాలను పోర్టు యాజమాన్యం పంపించిందని ఆధారాలతో ఆరోపించారు. పోర్టు మూతపడితే రాష్ట్రం ఆదాయాన్ని కోల్పోతుందన్నారు. సీఎం జగన్ తీరుతో కంటైనర్ రవాణా ద్వారా వచ్చే ఆదాయంలో సుమారు రూ.850 కోట్లను రాష్ట్రం నష్ట పోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనం, స్థానిక మంత్రి కాకాణి అవినీతితో పోర్టు పూర్తిగా ఉనికిని కోల్పోనుందని మండిపడ్డారు. రోడ్డునపడ్డ పదివేల కుటుం బాలకు, రెండు వేల మంది ఉద్యోగులకు పోర్టు సీఈవో కచ్చితమైన భరోసా ఇవ్వాగలరా అని ప్రశ్నించారు. ఈ ధర్నాలో టీజేపీతోపాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మృతులకూ ఓటు..!

- తూతూ మంత్రంగా ఓటర్ల జాబితా రూపకల్పన



ఓటరు జాబితాలో ఉన్న మృతుల పేర్లు పెద్ద సుబ్బయ్య, భార్యాభర్తలు ఎగ్గోలు పెద్దరాగయ్య, పెద్ద సంజీవమ్మ (సర్కిల్‌లో ఉన్నవారు)

మర్రిపాడు, జనవరి 31: సాధారణ ఎన్నికల దృష్ట్యా మృతులు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, డబుల్ ఎంట్రీలు, అనర్హులైన ఓటర్ల తొలగింపుపై దృష్టి పెట్టిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం నియోజకవర్గం వారీగా ఆ ప్రక్రియ పూర్తి చేసింది. కానీ మర్రిపాడు మండలంలో తూతూ మంత్రంగా చేసినట్లు కనిపిస్తోంది. అల్లంపాడు బూత్ నెంబరు 31లోని ఓటర్ల జాబితాలోని 834, 835, 841, 836, 1036, 1016, 1011, 994, 981, 970, 944, 912, 888 సీరియల్ నెంబర్లకు చెందిన వారు మృతి చెందినప్పటికీ జాబితా నుండి తొలగించకుండా యధావిధిగా నూతన ఓటర్ల జాబితాలో ప్రచురించారు. ప్రత్యేక శిబిరాలు సైతం నిర్వహించి, వచ్చిన అర్జీలను బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారించి సవరణ ప్రక్రియ చేపట్టామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

వృద్ధురాలి మెడలో సరుడు అపహరణ



సంఘటన స్థలం దగ్గర వివరాలు సేకరిస్తున్న సీఐ రాంబాబు

పొదలకూరు, జనవరి 31 : పట్టణంలోని తొగట వీధిలో ఓ చిన్న బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఆదెమ్మ అనే వృద్ధురాలి మెడలోని సరుడును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత రెండురోజులుగా మధ్యాహ్నం పూట ఓ గుర్తు తెలియని వ్యక్తి బంకు వద్దకు సిగరెట్ తాగేందుకు స్కూటీపై వస్తూ పోతూ ఉండేవాడు. బుధవారం కూడా ఆ వ్యక్తి వచ్చి రెండు సిగరెట్లు కొని అదును చూసి మెడలోని 3 సవర్ల సరుడు లాక్కెళ్లిపోయాడని ఆదెమ్మ వాపోయింది. కాగా, దొంగను వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేసిన ఆదెమ్మకు గాయాలు కాగా స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ రాంబాబు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మస్తాన్‌బీ మృతదేహానికి పోస్టుమార్టం



పోస్టుమార్టం నిర్వహిస్తున్న పోలీసులు

సంగం, జనవరి 31: మండలంలోని తలుపూరుపాడులో దారుణ హత్యకు గురై అంత్యక్రియలు నిర్వహించిన మస్తాన్‌బీ మృతదేహానికి బుధవారం పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల మేరకు ఈ నెల 27వ తేదీన గ్రామానికి చెందిన మస్తాన్‌బీ అనుమానాస్పదంగా మృతి చెందింది. కానీ గుండెపోటుతో మృతి చెందిందని భావించి కుటుంబ సభ్యులు 29వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. అయితే వృద్ధురాలి వద్ద ఉన్న బంగారు నగలు అపహరణతో వృద్ధురాలి మృతి హత్యగా భావించి కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రవినాయిక్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు పూడ్చిన మస్తాన్‌బీ మృతదేహాన్ని వెలికితీసి తహసీల్దారు నాగరాజు, ఇద్దరు వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని యధావిధిగా పూడ్చివేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	254
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5997
వెండి కిలో ధర	రూ. 73,800
వెండి ఒక గ్రాము	రూ. 75.80

మొగళ్లపాళెంలో గల్లంతైన వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్, జనవరి 31 : నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామ పంచాయతీ మొగళ్ల పాళెం చెరువులో మంగళవారం గల్లంతైన పులుసు పెంచలయ్య (60) మృతి చెందాడు. మృతిదేహాన్ని బుధవారం గ్రామస్తులు బయటకు తీశారు. పెంచలయ్యకు ఇద్దరు కుమారులున్నారు. కాగా, ఇదే చెరువులో కొంత కాలం క్రితం ఓ బాలుడు మృత్యువాతపడ్డాడు. చెరువులో మట్టిని విచ్చలవిడిగా తవ్వేయడం వల్ల ఏర్పడిన గుంతల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

పద్మవిభూషణ్ వెంకయ్యనాయుడుకు అభినందనలు



వెంకయ్యనాయుడును అభినందిస్తున్న బీజేపీ నేతలు

ఆత్మకూరు, జనవరి 31 : ప్రతిష్ఠాత్మక మైన పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపి కైన మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడును బీజేపీ సీనియర్ నేతలు సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డితో పాటు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి అభినంద నలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకూరులో కంచి పరమేశ్వరరెడ్డి చేపడు తున్న సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకుని అభినందించారు.

విద్యార్థులు లేక పాఠశాల మూసివేత

- లక్షలాది రూపాయలు వృథా



విద్యార్థులు లేక మూతపడిన ఎంపీ యూపీ స్కూల్

తోటపల్లిగూడూరు, జనవరి 31 : విద్యాశాఖ అవగాహన లోపం కారణంగా నాడు - నేడు కింద లక్షల రూపాయలు వెచ్చింది నిర్మించిన ఎంపీ యూపీ స్కూల్‌ను విద్యార్థులు లేక మూసివేసిన సంఘటన మండలంలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తపాలెంలో మూడు పాఠశాలలు ఉన్నాయి. హరిజన వాడలో ఎంపీపీ స్కూల్, ఉర్దూ పాఠశాల, మెయిన్ ఎంపీ యూపీ పాఠశాల ఉండగా ఎంపీపీ స్కూల్‌లో ఏడుగురు విద్యార్థులు, ఉర్దూ పాఠశాలలో ముగ్గురు, మెయిన్ పాఠశా లలో ఏడుగురు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ మూడు పాఠశాలల మొత్తం హాజరు 17 మంది కాగా, ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కాగా, పాఠశాలలో సరైన బోధన లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు స్కూల్‌లో చేరారు. దీంతో ప్రజాధనం నిరుపయోగం అయిందని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. గ్రామంలో ఉన్న మూడు పాఠశాలలను ఒకే పాఠశాలగా చేసి విద్యాబోధన అందిస్తే నిరుపేద కుటుంబాలైనా ఆ స్కూల్‌లో చదివించుకునేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

బతుకు మారాలంటే బాబు రావాలి !

- నెల్లూరుకు చేరుకున్న అశోక్ పాదయాత్ర



అశోక్‌కుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : 'బతుకు మారాలంటే బాబు రావాలి' అన్న నినాదంతో నెల్లూరు రూరల్ కోడూరుపాడుకు చెందిన దళిత యువకుడు చింతల అశోక్‌కు మార్ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన పాద యాత్ర బుధవారం నెల్లూరుకు చేరుకుంది. అశోక్ కుమార్ ఇచ్ఛాపురం నుంచి తిరుమల వరకు మొత్తం 1200 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తు న్నారు. చంద్రబాబు సీఎం కావాలని ఆకాంక్షిస్తూ చేపట్టిన ఈ యాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. నెల్లూరులో టీడీపీ శ్రేణులు అశోక్‌కు ఘనంగా స్వాగతం పలికాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లా డుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించడం చంద్రబాబు తోనే సాధ్యమని చెప్పారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ప్రతి సభలో మాట్లాడే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్లను మూసేసి ఆ సామాజిక వర్గాల యువతకు ఉపాధిని దూరం చేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక 27 ఎస్సీ సంక్షేమ పథకాలను రద్దు చేసిన దళిత ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని దుయ్యబట్టారు.

రాములమ్మ కుటుంబానికి న్యాయం చేయండి

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జనవరి 31 : విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన ఏలూరు రాములమ్మ అనే గిరిజన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఆ పార్టీ విడవలూరు మండల అధ్యక్షుడు కసుపర్తి నాగేంద్ర మాట్లాడుతూ ఊటుకూరులో ఏలూరు రాములమ్మ, చెంచయ్య దంపతులు వారి నలుగురు బిడ్డలతో చిత్తు కాగితాలు ఏరుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వారి రెండేళ్ల కుమారుడు పోలయ్య గత నెల 28న రాత్రి 12 గంటల సమయంలో కనిపించకుండా పోయాడన్నారు. అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ జరిపి నలుగురు నిందితులను గుర్తించి వారి ద్వారా పోలయ్య అనే పిల్లవాడ్ని రాములమ్మ దంపతులకు అప్పగించారన్నారు. అయితే బిడ్డను ఎత్తుకెళ్లిన నిందితులపై చర్యలు తీసుకోలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. అలాగే, నిరుపేదలైన రాములమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని, ఇంటిని కేటాయించాలని కోరారు. ఈ ధర్నాలో బీజేపీ గిరిజనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాములమ్మ కుటుంబంతో కలిసి మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రూ.1.5 కోట్ల విలువైన మున్సిపల్ బావుల

స్థలాల కబ్జాకు రంగం సిద్ధం!

- చోద్యం చూస్తున్న అధికారులు

కావలి, జనవరి 31 : కబ్జాకు కాదేది అనర్హం అంటూ కబ్జాదారులు చివరకు కావలి పట్టణంలో మున్సిపల్ బావులను, వాటి స్థలాలను కూడా వదలడం లేదు. పట్టణంలో అత్యంత ఖరీదైన ప్రాంతాలైన పెద్దపవని రోడ్డులోని సాయిమహల్ ఎదురు బావి, దాని చుట్టూ స్థలం, క్రిష్టియన్‌పేట మొదటి లైనులో కార్నర్‌లో ఉన్న మున్సిపల్ బావి స్థలం ఆక్రమణకు కబ్జాదారులు పథకం సిద్ధం చేసుకున్నారు. ఈ రెండు స్థలాల విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ.1.5 కోట్ల వరకు ఉంటుంది. ఇంత విలువైన స్థలాల కబ్జా వెనుక అధికారపార్టీ నాయకుల హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది. విలువైన స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోలేదంటే వారికి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఉంటాయనే ప్రచారం ఉంది. సాయిమహల్ సెంటర్‌లో ఉన్న బావిని ఏకంగా పూడ్చి వేసి అక్కడ భూమి పూజ చేసేందుకు సిద్ధమై స్థానికుల నుంచి వ్యతిరేకత రాకుండా.. అధికారుల నుంచి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు వైసీపీ రంగులతో కూడిన షామియానా ఏర్పాటు చేశారు. దాని విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



సాయిమహల్ ఎదుట మున్సిపల్ బావిని పూడ్చి వైసీపీ రంగులతో ఏర్పాటు చేసిన షామియానా

క్రిష్టియన్ పేటలో...

కావలి పట్టణంలో ట్రంకురోడ్డు తర్వాత అత్యంత విలువైన ప్రాంతం క్రిష్టియన్ పేట. పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రులన్నీ అక్కడే ఉండటంతో అక్కడ స్థలాల ధరలు చుక్కలను చూస్తున్నాయి. సాయిమహల్ సెంటర్‌లో బావి పూడ్చి అక్కడ భూమి పూజకు సిద్ధమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారుల కన్ను క్రిష్టియన్‌పేట బావిపై పడింది. ఇక్కడ స్థలం విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉంటుంది. అయితే అంత విలువైన స్థలంలో బావి పూడ్చితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని తొలుత పార్కింగ్ పేరుతో బావి చుట్టూ స్థలంను బాగు చేసి నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ఆ తర్వాత తెలియకుండా క్రమేపి బావిని పూడ్చి వేసి ఆ స్థలం హస్తగతం చేసుకునేందుకు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.



క్రిష్టియన్‌పేట మొదటి లైనులో మరో మున్సిపల్ బావి స్థలం ఆక్రమణకు చేపట్టిన పనులు

కబ్జా స్థలం స్వాధీనం చేసుకుంటాం

పట్టణంలో సాయిమహల్ సెంటర్ వద్ద బావి పూడ్చి అక్కడ షామియానా వేసిన సంఘటన తమ దృష్టికి వచ్చింది. అక్కడకు మున్సిపల్ సిబ్బందిని పంపి ఆ స్థలం మున్సిపాల్టీదని బోర్డు ఏర్పాటు చేసి కబ్జాదారుల నుంచి కాపాడుతాం. అలాగే క్రిష్టియన్‌పేట బావి స్థలం ఆక్రమణ విషయం తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- బాబూరావు, పట్టణప్రణాళిక అధికారి, కావలి

సెబ్ ఈఎస్‌గా శ్రీధర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 31: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నెల్లూరు ఈఎస్‌గా కే బాబు శ్రీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 1996లో ఎక్సైజ్ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. కర్నూలు, జమ్మలమడుగు, తిరుమల, అన్నమయ్య, కడప జిల్లాల్లో పనిచేశారు. నెల్లూరు జిల్లాలోనూ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో విధులు నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తుండగా ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు సెబ్ ఈఎస్‌గా నియమితులయ్యారు. కాగా, శ్రీధర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

3న హాకీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జనవరి 31 : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 3వతేదీ హాకీ జిల్లా జట్ల ఎంపిక జరగనుంది. ఉదయం 10 గంటలకు జూనియర్ బాలిక, సబ్ జూనియర్ బాలుర జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హాకీ ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా కార్యదర్శి పీ జగన్‌మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు అసోసియేషన్ డైరెక్టర్ పీ థామస్‌పీటర్ ఫోన్ 9440466190 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'ఆరోగ్య సురక్ష'పై ప్రత్యేక దృష్టి పెట్టండి

కొత్త కార్డుల పంపిణీ వేగవంతం చేయండి

కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (వైద్యం), జనవరి 31 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులను కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, రెవెన్యూ వసూళ్లు, కులగణన, జగనన్నకు చెబుతాం అన్న కార్యక్రమాలపై అధికారులకు నెల్లూరు తిక్కన భవన్ నుంచి మార్గనిర్దేశం చేశారు. ఆరోగ్య సురక్ష రెండవ విడత శిబిరాలలో ఓపీ రిజిస్ట్రేషన్ సంఖ్యను పెంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కులగణనను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, హౌసింగ్ పీడీ నాగరాజు, డీఎంహెచ్‌వో పెంచలయ్య, నుడా వీసీ బాపిరెడ్డి, మత్స్య, పశుసంవర్ధనశాఖల జేడీలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణం

● నాలుగేళ్లుగా కొనసాగుతున్న పనులు

ఉదయగిరి, జనవరి 31: మండలంలోని అనేక పంచాయతీల పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ భవనాలు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలో ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, ఆర్‌బీకేకు రూ.21 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.17 లక్షలు కేటాయించారు. ఉదయగిరి సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాలు ఒకే చోట నిర్మిస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. అలాగే నేలటూరు సచివాలయ పరిధిలోని భవనాలకు నిధుల లేమితో పనులకు గ్రహణం పట్టింది. నాలుగేళ్లుగా నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. పాత భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయా సచివాలయాల ప్రజలు కోరుతున్నారు. అర్ధాంతరంగా ఆగిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఉదయగిరిలో అసంపూర్తిగా హెల్త్ సెంటర్ నిర్మాణం

కులగణన సర్వే పరిశీలన


కులగణన సర్వే పరిశీలిస్తున్న డీబీసీడబ్ల్యువో

ఆత్మకూరు, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో, మండలంలో చేపట్టిన కులగణన సర్వే 89 శాతం పూర్తయిందని డీబీసీడబ్ల్యువో వై వెంకటయ్య తెలిపారు. బుధవారం ఆయన సచివాలయ సిబ్బంది, వాలంటీర్లుతో కలిసి మున్సిపాల్టీ పరిధిలో పలు కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి డాక్యుమెంట్లు చూపించవలసిన అవసరం లేదని మౌఖికంగా తెలియజేయాల్సిన అంశాలను మాత్రమే నమోదు చేస్తారని ఆయన తెలిపారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

చేజర్ల, జనవరి 31: మండలంలోని పెరుమాళ్ళపాడు ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, సచివాలయ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్ వాసు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుండే సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు. పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రసాద్, అధ్యాపకులు ఎమ్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

సంగం, జనవరి 31: స్థానిక ఎంపీడీవోగా పనిచేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన గోపీని కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీవోపీఆర్డీ రమేష్, కార్యాలయ సిబ్బంది, సెక్రటరీలు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కందుకూరులో బుధవారం జరిగిన నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొన్న నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీమతి శాంతకుమారి

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 31: నర్రవాడలో శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార వారోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు మండలంలోని బండ కిందపల్లి గ్రామ శ్రీసీతా రాములస్వామి ఆలయంలో అష్టోత్తర పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు కల్యాణోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. గ్రామోత్సవం చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

సాట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఆత్మకూరు, జనవరి 31 : పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో అభ్యాస్ అకాడమీ వారు ఈనెల 7న నిర్వహించిన సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్)లో రాష్ట్ర ర్యాంకు సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రగతి ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించి అభినందించారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ఏఎస్ పేట, జనవరి 31: నియోజకవర్గ స్థాయిలో బుధవారం ఆత్మకూరులో ఎంఎంటిఎస్ స్టేజ్- 2 పరీక్షలలో ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ రమణరెడ్డి తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి కే మోహన్ నరేంద్ర ప్రథమ స్థానం, వి యషిత ఐదవ స్థానంలో నిలిచారని తెలిపారు. వారిని హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి, కరస్పాండెంట్ రమణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, జనవరి 31: నెల్లూరులో ఈనెల 5,6వ తేదీల్లో నిర్వహించే ట్రెజరీ క్రీడా పోటీలకు ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయ ఉద్యోగులను క్రీడల్లో పాల్గొనాలని ఆహ్వానించి అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోడ సుబ్రహ్మణ్యం, ఉప ఖజానాధికారులు చిట్టేటి మమత, దయాకర్, సీనియర్ అకౌంటెంట్‌లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్‌కుమార్, క్రీడా కమిటీ సభ్యులు నరేంద్ర, చంద్ర, మాలకొండరావు, ఆదిత్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

విద్యార్థుల అల్పాహారానికి ఆర్థిక చేయూత

ఉదయగిరి రూరల్, జనవరి 31: మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించేందుకు బుధవారం దాతలు చేయూతనందించారు. 60 రోజులపాటు జరిగే స్టడీ కార్యక్రమానికి సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థులు కల్లూరి రవిరెడ్డి, దేవసాని జనార్ధన్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు ఫణిరాజ్, సుబ్బారెడ్డిలు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No.43/2022
పునుగోటి వెంకటయ్య@ వెంకటరెడ్డి ... పిటిషనర్/వాది
నోటీసు
1.దేవాండ్ల కృష్ణ వగైరా ... రెస్పాండెంట్స్/ప్రతివాదులు
R1: దేవాండ్ల క్రిష్ణ S/o. [illegible]
R2: దేవాండ్ల లక్ష్మీపార్వతి W/o. క్రిష్ణ
R1&R2 [illegible]
R3: తమటమ్ రత్నమ్మ W/o. [illegible]
[illegible] తేది:02-02-2024కి [illegible]
(కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:02-02-2024 [illegible] సి.హెచ్.హరికృష్ణ న్యాయవాది, కందుకూరు

బీజేపీ అభివృద్ధికి కృషిచేయాలి

వరికుంటపాడు, జనవరి 31: మండలంలో ప్రతిఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన మండల కమిటీ సమా వేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నూతన మండల కమిటీ అధ్యక్షునిగా ఏనుగు ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకొని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, మండల ఇన్‌చార్జి నారాయణరెడ్డి, శివారెడ్డి, పరంధామిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రజాసేవే లక్ష్యం : ముప్పాళ్ల

ఉదయగిరి రూరల్, జనవరి 31: ప్రజాసేవ చేసేందుకే జైభారత్ పార్టీ పెట్టినట్లు ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పాళ్ల శ్రీరామరాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయగిరి పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే పార్టీ ధ్యేయమన్నారు. మద్యపాన నిషేధం బాధ్యత మహిళల చేతికే ఇవ్వడం జరుగుతుందన్నారు.జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి కూడా ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్టీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్

ఆత్మకూరు, జనవరి 31 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు మల్టీ కోర్సులను అభ్యసించాలని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ డైరెక్టర్ డాక్టర్ జె శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉన్నతవిద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు భవిష్యత్‌లో పనికివచ్చే మల్టీ కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ షణ్ముఖకుమార్, ఏఎస్ఆర్, బిఎస్ఆర్ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు ఎం సుబ్బారెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఎస్వి జూనియర్ కళాశాల చైర్మన్ కె అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

చేజర్ల: మండలంలోని బిల్లుపాడు, యనమదల గ్రామాలలో బుధవారం ఆత్మకూరు శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ పీర్ల పార్థసారధి, గోతం వెంకటసుబ్బయ్య, వీరరాఘవరెడ్డి, నోటి సుందరరామిరెడ్డి, తిరపతిరెడ్డి, సుధాకరరెడ్డి, నాగార్జున, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసరా మహిళలకు చెక్కుల పంపిణీ

ఉదయగిరి, జనవరి 31: మహిళా సాధికారతే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చెక్కులు అందజేశారు. అలాగే ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీఎం ఖాజారంతుల్లా, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఇత్తడి రమణయ్య, అడసుమల్లి వెంకటేశ్వర్లు, అక్కి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్, జనవరి 31: మండలంలోని కృష్ణంపల్లి, జీ.చెరువుపల్లి గ్రామాలకు చెందిన వంశీ, రామరాజులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొన్న నియోజకవర్గ టీడీపీ నాయకులు, కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ బుధవారం తన ప్రతినిధులతో వారికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి తుమ్మల భాస్కర్, కిరణ్‌చౌదరి, జల్సాయాదవ్, హరీష్‌యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

4న వరికుంటపాడు మండల సమావేశం

వరికుంటపాడు, జనవరి 31: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

'ఉపాధి'లో అవకతవకలు

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం
● రూ.89,069 రికవరీకి అధికారుల ఆదేశం

లింగసముద్రం, జనవరి 31 : మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.9.39 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ పనులపై గత 10 రోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి కూలీలను విచారించారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో యూ.శేషుబాబు అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డీ వెంకట్రావు పాల్గొన్నారు. గ్రామాల్లో డీఆర్పీలు గుర్తించిన లోపాలను, అవకతవకలను గ్రామ పంచాయతీల వారీగా చదివి వినిపించారు. అంగిరేకులపాడులో గంటా శ్రీను, ఆయన భార్య లక్ష్మి హైదరాబాద్‌లో ఉండగా వారు 5 వారాలు పనులకు వచ్చినట్లు నమోదు చేసి రూ.10,952 డ్రా చేశారు. అలాగే చెన్నై, హైదరాబాద్‌లో ఉంటున్న గల్లా సాయిరామ్ రూ4,343, గంటా రఘురామయ్య రూ.4,657, మాలపాటి మహేంద్రల పేరుతో రూ.8,984 స్వాహా చేశారని చెప్పారు. ఇదే గ్రామంలో రూ.5,89,253తో నిర్మించిన వరదకట్ట మట్టిని ఎత్తుకెళ్లడంతో ఆ నిధులు నిరుపయోగమయ్యాయి. ఇద్దరు వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులకు వెళ్లినట్టుగా గుర్తించారు. పెదపవనిలో కూడా షేక్ అలియాజ్, రహంతుల్లా మరో ఇద్దరు పనికి వెళ్లకపోయినా వారి పేరుతో రూ.3,200 స్వాహా చేశారు. ఇదే గ్రామంలో చెరువుల్లో చేసిన పనుల్లో కొలతల్లో వచ్చిన తేడాలతో రూ.5,40,000 అదనంగా ఖర్చు చేసినట్లు చెప్పారు. లింగసముద్రంలో దిడ్డి మాల్యాద్రి అనే రైతు నిమ్మ మొక్కలు వేయగా, ప్రసుత్తం ఆ పొలంలో మొక్కలు లేవు. దీంతో రూ.42,800 దుర్వినియోగమైనట్లు పేర్కొన్నారు. తిమ్మారెడ్డిపాలెంలో కేసంరెడ్డి వెంకటరామిరెడ్డి ఈ పథకంలో జామ మొక్కలు వేశారు. కానీ కాపు కాయలేదనే కారణంతో వాటిని తొలగించి, మిరపపైరు సాగు చేశారు. దీంతో రూ.17,000 దుర్వినియోగమైనట్లు చెప్పారు. చాలా గ్రామాల్లో చెరువులు, కాలువల్లో పూడిక తీతలు, మొక్కలు లేకపోవడం లాంటి వాటిల్లో రూ.30 లక్షలు తేడా వచ్చినట్లు గుర్తించారు. దీనికి సిబ్బందిపై రూ.15 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకుండానే రూ.1,20,000 స్వాహా చేశారని తెలిపారు. ఈ అవకతవకలకు సంబంధించి సిబ్బంది నుంచి రూ.89,069 రికవరీకి ఆదేశించినట్లు పీడీ వెంకట్రావు చెప్పారు. వీటిలో అంగిరేకులపాడు ఎఫ్ఏ నుంచి రూ.40,824, రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. త్వరలో ఈ మొత్తాన్ని ఎఫ్ఏల నుంచి రికవరీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవీవీ సురేషబాబు, ఏపీడీ మృదుల, అంబుడ్స్‌మెన్ ఎం వెంకటరామిరెడ్డి, ఎస్ఆర్పీ కె వెంకయ్య, ఏఈ ఎ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.




ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

పొగతో వలయాకారం!

● వింతగా చూసిన ప్రజలు

అల్లూరు, జనవరి 31 : అల్లూరులో బుధవారం వింత చోటు చేసుకుంది. సాయంకాల సమయంలో ఆకాశంలో పొగతో రెండు వలయాలు ఏర్పడ్డాయి. ఈ వలయాలు అసలు ఏమిటని ముందుగా ఆందోళన చెందిన ప్రజలు తీక్షణంగా పరిశీలించగా పొగతో కూడుకున్నవిగా భావించారు. పొగ ఎటువంటి ఆకారంలో ఉన్నా ఒక్క నిమిషంలోపు సాధారణంగా మారిపోతోంది. కానీ ఇవి 20 నిమిషాల పాటు ఉండడంతో ప్రజలు ఆశ్చర్యంగా చూశారు. చివరకు అల్లూరు సబ్‌స్టేషనులో రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు చెలరేగడంతో అందులో నుంచి వచ్చిన పొగ వలయాలుగా ఏర్పడి గ్రామంపైకి రావడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. కొద్దిసేపటికి అవి గాలిలో కలసిపోయాయి. అందరూ దీనికి ఆసక్తిగా చూడడంతో చర్చనీయాంశంగా మారింది.


ఆకాశంలో పొగతో ఏర్పడిన వలయాకారం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరులోని 133 కేవీ సబ్‌స్టేషనులో ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపాలతో బుధవారం సాయంత్రం కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉండే సీటీ ఒక్కసారిగా పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనతో అల్లూరుతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు అసహనానికి గురయ్యారు.

ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత : ఆర్టీవో

కావలి రూరల్, జనవరి 31: రహదారి ప్రమాదాలు అరికట్టడం అందరి బాధ్యత అని ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలల్లో భాగంగా పట్టణంలోని లారీ ఒనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం యూనియన్ అధ్యక్షుడు మండలి క్రిష్ణారావు అధ్యక్షతన వివిధ వాహనాల డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డ్రైవర్లు వాహనాలు నడుపుతూ గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసి ఆగిన గుండె కొట్టుకునేలా చేసే విధానంపై వైద్యులు చైతన్య, రేవంత్, రమ్యలు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా లారీ యూనియన్ నాయకులు ఆర్టీవో, రవాణాశాఖ అధికారులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐ కరుణాకర్, లారీ యూనియన్ నాయకులు రంగారెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, నరేంద్ర, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, సద్గుణ, కాలేషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీవో సుధాకర్‌రెడ్డి

బీసీలకు డబ్బు లేదు.. దమ్ముంది

● కలిగిరిలో జయహో బీసీ సదస్సు

కలిగిరి, జనవరి 31: రాష్ట్రంలో బీసీలను ఆదరించేది ఒక్క తెలుగుదేశంపార్టీ అని, బీసీలకు డబ్బు లేదు.. కానీ దమ్ముందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వీ చెంచల బాబు యాదవ్, బీసీ రాష్ట్ర ముదిరాజ్ సాధికారక కన్వీనర్ పీఎల్ రావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం కలిగిరి, జలదంకి మండలాల బీసీ నాయకులతో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఓట్లతో గద్దెనెక్కిన వైఎస్ జగన్ బీసీ కార్పొరేషన్లను నిర్వీరం చేసి బీసీలను ఆర్థికంగా అణిచివేశాడన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ తన సామాజిక వర్గానికి చెందిన వారికే అత్యున్నత పదవులు కట్టబెట్టుకొని బీసీలకు మొండి చేయి చూపాడన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీల సత్తాను చూపి ఉదయగిరి నియోజకవర్గంలో బొల్లినేని వెంకటరామారావుని ఎమ్మెల్యేగా చేసుకోవడంతోపాటు, సీఎంగా చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలిగిరి, జలదంకి టీడీపీ మండల కన్వీనర్లు బిజ్జం క్రిష్ణారెడ్డి, పీ.మధురెడ్డి, బీసీ నాయకులు ఉప్పు భాస్కర్, ఎస్‌కే సుభాన్, జ్ఞానేంద్ర, గంజాం రాఘవేంద్ర, కాకు మహేష్, శ్రీకుర్తి రవీంద్రబాబు, మొక్కా బాబు తదితరులు పాల్గొన్నారు.


జయహో బీసీ బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

పని మాకు.. ఫలితం మరొకరికా?


● వైద్యాధికారికి ఏఎన్ఎంల మొర

వలేటివారిపాలెం, జనవరి 31 : అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు చేసేది ఏఎన్ఎంలు.. ఇన్సెంటివ్ ఇచ్చేది మాత్రం ఎంఎల్‌హెచ్‌పీలకా అని ఏఎన్ఎంలు ప్రశ్నించారు. ఈ మేరకు.. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకు ఏఎన్ఎంలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ వర్క్, ఆర్‌సీహెచ్ పోర్టల్ మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆన్‌లైన్ సేవలు మొత్తం ఏఎన్ఎంలు మాత్రమే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి మేము ఆన్‌లైన్ సేవలు చేయదలుచుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంలు లావణ్య, విజయకుమారి, కళ్యాణి, రాజేశ్వరి, బాలకోటమ్మ, విజయమ్మ, వాసంతి, అనీత, ప్రమీల, రత్నకుమారి, చెంచులక్ష్మి, అంజని, శ్యామల పాల్గొన్నారు.


డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

ఆరుతడి పంటలు వేసుకోండి

కావలి, జనవరి 31: చెరువులో నీరు తక్కువగా ఉన్నందున వరి నాట్లు వేస్తే నష్టపోతారని, ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాధికారి లలిత, నీటిపారుదల శాఖ ఏఈ జంపాని కిరణ్ రైతులకు సూచించారు. వారిద్దరు బుధవారం కావలి రూరల్ మండలంలోని సిరిపురం, చలంచర్ల గ్రామాల్లో పర్యటించారు. అక్కడ రైతులు ఇంకా వరి నాట్లు వేస్తుండటంతో చెరువులో నీరు తక్కువగా ఉన్నందున వరినాట్లు వేసున్న రైతుల వద్దకు వెళ్లి నీటి లభ్యతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం చెరువులో నీరు తక్కువగా ఉన్నందున ఇప్పుడు వరినాట్లు వేస్తే నీరు చాలదని పంటలు పండక పెట్టుబడులు పెట్టి రైతులు నష్ట పోవద్దని తెలిపారు. ఆరు తడిపంటలు వేసుకోవాలని సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయసహాయకులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు పట్టణ ఎస్ఐగా ఆనంద్‌భాస్కర్ బాధ్యతల స్వీకరణ

కందుకూరు, జనవరి 31: కందుకూరు పట్టణ ఎస్ఐగా ఆనంద్‌భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన హనీఫ్ సంక్రాంతి పర్వదినం సందర్భంగా జూదరుల వద్ద అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావటంతో జిల్లా ఎస్పీ తక్షణం వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు దిశ పోలీసుస్టేషన్ నుంచి బదిలీ అయిన ఆనంద్‌భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు.



మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

కందుకూరు, జనవరి 31: కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జరిగిన బదిలీలలో భాగంగా కందుకూరులో 4ఏళ్ల 4నెలలు సుదీర్ఘకాలం పనిచేసిన ఎస్.మనోహర్ స్థానంలో బద్వేలు కమిషనర్‌గా ఉన్న కృష్ణారెడ్డిని ఇక్కడ నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బిట్రగుంట, జనవరి 31: బోగోలు మండలంలోని పలు కుటుంబాలను కావలి టీడీపీ నాయకుడు కావ్య కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. కోవూరుపల్లికి చెందిన టీడీపీ నేత ఇందుపూరు ధనంజయరెడ్డి కుమారుడు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బోగోలు వైసీపీ సీనియర్ నాయకుడు తూపిరి పెంచలయ్య ఉత్తర క్రియల్లో పాల్గొన్ని సంతాపం తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు నాయకులు ఐ.రాముర్డెడ్డి, తిరుపతిరెడ్డి, ఎల్.నాటకరాణిభాస్కర్, ఎన్.రంగయ్య, తదితరులు ఉన్నారు. అలాగే తూపిరి పెంచలయ్య ఉత్తర క్రియల్లో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్.మాల్యాద్రి, సర్పంచులు పీ.అనిత, సురేష్‌గౌడ్, యు.మాచర్ల, మాజీ సర్పంచి కే.కృష్ణయ్య, పాల్గొన్నారు. అలాగే కావలి, అల్లూరు, దగదర్తికి నేతలతోపాటు పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కుక్కల స్వైరవిహారం

లింగసముద్రం, జనవరి 31 : మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాఠశాలలో విచ్చలవిడిగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది హడలిపోతున్నారు. ఇటీవల ఒక బాలికను కుక్క కరవడంతో ఆ బాలికను తలిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయించుకున్నారు. రెండు రోజుల క్రితం పాఠశాల గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరిని కుక్క కరిచింది. అలాగే బుధవారం పాఠశాల స్వీపర్ ఒకరిని కుక్క కరవగా ఆమె లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకొని వెళ్లింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు వారి తలిదండ్రులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

కందుకూరు, జనవరి 31: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కోసం కోవూరు గ్రామసర్పంచు ఆవుల మాధవరావు బుధవారం రూ.28,216 విరాళంగా అందజేశారు. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు నలబోతుల మురళి, కాటా చెంచురామయ్యలకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గాండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు

కావలిటౌన్, జనవరి 31: రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన గణిత శాస్త్ర పోటీల విజేతలకు బుధవారం సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. జనతాపేటలోని విశ్వశాంతి పాఠశాలలో ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత వసతిగృహ సంక్షేమ అధికారి షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్వీ రమణయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కణ్యాణి, ఖాదర్‌బీ, రఘునందనరావు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

లింగసముద్రం, జనవరి 31 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు బుధవారం స్థానిక కెనరాబ్యాంకును సందర్శించారు. వృత్తివిద్య కోర్సులో భాగంగా స్కూల్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ కోసం ఒకేషనల్ ట్రైనర్ ఎం.పాండురంగారావు ఆధ్వర్యంలో బ్యాంకును సందర్శించారు. ఆ బ్యాంకులో జరిగే కార్యకలాపాలను బ్యాంకు అధికారులు వారికి వివరించారు. ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్సార్ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించడం వలన వారి శిక్షణ నైపుణ్యాలు మెరుగుపడడమే కాకుండా, భవిష్యత్‌లో ఇవి వారికి ఎంతగానో దోహదపడతాయన్నారు.

రేపు నారా భువనేశ్వరి పర్యటన : కురుగొండ్ల

రాపూరు(డక్కిలి), జనవరి 31 : రాపూరు, కలువాయి మండలాల్లో ఫిబ్రవరి 2వ తేదీన నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పర్యటిస్తారని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు వార్త విని తట్టుకోలేక కలువాయిలో బోలిగిల చిన్నయ్య, రాపూరు మండలం తాతిపల్లి గ్రామంలో సన్నిబోయిన కృష్ణలు మృతి చెందారు. ఈ రెండు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నారా భువనేశ్వరి ఆరోజు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందచేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు తాను భువనేశ్వరి పర్యటించే గ్రామాల్లో తగు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ఆమె కలువాయికి చేరుకుని తొలుత చిన్నయ్య కుటుంబాన్ని, అనంతరం మధ్యాహ్నం తాతిపల్లికి వెళ్లి కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. సాయంత్రం వెంకటగిరి మీదుగా రేణిగుంటకు చేరుకొని విమానంలో హైదరాబాద్‌కు వెళతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు నువ్వుల శివరామకృష్ణ, రాపూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏదోటి కోటేశ్వర నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, గున్నపనేని ప్రసాద్, పచ్చిగళ్ళ రత్నయ్య, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హనుమంత్ చౌదరి, సుకుమార్ తదితరులు వున్నారు



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

బ్యాంకు మేనేజరు మృతికి కురుగొండ్ల సంతాపం

ఇటీవల మృతి చెందిన రాపూరు మండలం సిద్దవరం గ్రామానికి చెందిన విశ్రాంత సెంట్రల్ బ్యాంకు మేనేజరు సుదరరామిరెడ్డి కుటుంబాన్ని బుధవారం వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాపూరు వైసీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదనరెడ్డి, నారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు, అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, డక్కిలి మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, తదితరులు సుందరామిరెడ్డికి నివాళులు అర్పించారు.

విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ అవసరం

వెంటాచలం, జనవరి 31: క్రమశిక్షణ లేని విద్య ఎన్నటికీ రాణించలేదని సింహపురి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ దయాకర్‌రావు అన్నారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మానసిక ఆందోళన, లక్ష్య నిర్ణయం, శారీరక ఆరోగ్యం, ఏకాగ్రత తది తర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దయాకర్‌రావుతోపాటు విశ్రాంత డీఎస్పీ తోట ప్రభాకర్ విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీదరాలకు సేవారత్న పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 31: బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు చీదరాల చెన్నయ్యకు సేవారత్న పురస్కారం లభించింది. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో రచయిత పంచాగ్నుల విశ్వేశ్వర శర్మ జ్ఞాపకార్థం ప్రముఖులకు అవార్డుల ప్రదానం జరిగింది. ఇందులో చెన్నయ్యకు అవకాశం దక్కగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ చేతుల మీదుగా అవార్డు, మెమెంటో అచ్చి పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లయినా
సచివాలయాల నిర్మాణం

● పూర్తి చేయాలని అధికారులపై ఒత్తిడి



అధికారుల ఒత్తిడితో నిర్మాణంలో ఉన్న ముత్తుకూరు సచివాలయం

ముత్తుకూరు, జనవరి 31 : ఆర్భాటంగా ప్రారంభించిన సచివా లయ భవన నిర్మాణాలు ఐదేళ్లవుతు న్నప్పటికీ పూర్తికాకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో నేలటూరు, పైనంపురం, నారికేళపల్లి, పొట్టెంపాడు, మామడి పూడి తదితర గ్రామాల్లో సచివాలయ నిర్మాణాలు పూర్తికాలేదు. మండల కేంద్రమైన ముత్తుకూరులో మూడు సచివాయాలు నిర్మించాల్సి ఉండగా ఒక్క సచివాలయం మాత్ర మే నిర్మాణ దశలో ఉంది. మిగిలిన రెండు చోట్ల అద్దె భవనాలు, తుఫాను షెల్టర్‌లో నిర్వహిస్తున్నారు. ముత్తుకూరు కూడలిలో ఉన్న సచివాలయ నిర్మాణం అర్థాం తరంగా నిలిపివేయడంతో, పూర్తి చేయాలని మంత్రి కాకాణి ఆదేశించారు. అయితే నాయ కులు ముందుకు రాకపోవడంతో ఎలాగైనా పూర్తి చేయాలని అధికారులపై ఒత్తిడి తేవడంతో స్థానిక అధికారి ఒకరు తప్పనిసరి పరిస్థితుల్లో నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. కాగా, పూర్తి చేసిన సచివాలయ భవనాలను ప్రారంభించడమే కానీ వాటికి సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించకపోవడంతో నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు, నాయకులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు సీఎం కావాలనే పాదయాత్ర

● కార్యకర్తను అభినందించిన మాజీ మంత్రి సోమిరెడ్డి

మను బోలు, జన వరి 31: చంద్రబాబు నాయుడు సీఎం కావాలన్న ఆకాం క్షతో టీడీపీ కార్యకర్త చింతల అశోక్ చేస్తున్న పాదయాత్ర బుధవారం మనుబోలుకు చేరుకుంది. పాదయాత్ర చేస్తున్న అశోక్‌ను మనుబోలులో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం కోడూరుపాడు గ్రామానికి చెందిన అశోక్ ఇచ్ఛాపురం నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేస్తున్నాడు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయం-చంద్రబాబు ఆచరణ పేరుతో పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఈ ఐదేళ్ళలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. ఇలాంటి సమయంలో రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అత్యవసరమన్నారు. ప్రజలు ఆలోచించాలన్నారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని, సర్వేపల్లిలో సోమిరెడ్డి గెలిచి రికార్డు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, మధునాయుడు, పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖరరెడ్డి, రమేష్ రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, పొన్నూరు అశోక్, చింతల వెంకటేశ్వర్లు, రాజాగౌడ్,నరసయ్య, అంకయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి విశేష కుంకుమ పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 : నగరంలోని కేపీహెచ్‌బీలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం రాత్రి రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమం దేవదాయ ధర్మదాయశాఖ ధార్మిక పరిషత్ ప్రచార వారోత్సవాలలో భాగం గా జరిగింది. పధాన అర్చకుడు రఘురామశర్మ, వేద పండితుడు రామకృష్ణ శర్మ ఆధ్వ ర్యంలో పూజాదికాలు జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి

సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ : సోమిరెడ్డి

● టీడీపీలో భారీ చేరికలు



టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి

ముత్తుకూరు, జనవరి 31 : సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతుందని టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండల మత్స్యకార విభాగం అధ్యక్షుడు వావిల జనార్ధన్, వావిల ఆంజనేయులు, వావిల మహేంద్ర, భక్తాని జగన్నాథం ఆధ్వర్యంలో బుధవారం నేలటూరుపాలెం నుంచి పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అల్లీపురంలోని తన నివాసం వద్ద పార్టీలో చేరిన వారికి సోమిరెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. రాష్ట్రాన్ని కాపాడడం చంద్రబాబుకే సాధ్యమని నమ్మి టీడీపీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాకాణి ఓటమి ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు ముని రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉడతా ఈశ్వరయ్య, కొండూరు సురేష్, మేకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏపీలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం : చింతా

సైదాపురం, జనవరి 31: ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మహా ప్రభంజనం అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ చేసిన త్యాగాలు, సేవలు ప్రజల్లో ఇంకా గుర్తున్నాయన్నారు. ఇందిరా గాంధీ ప్రజల గుండెల్లో బతికే ఉందన్నారు. ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఓడిపోయి ఇంటికెళ్లడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులు రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటం

● టీడీపీ, జనసేన నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 31: వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బుచ్చి నగర పంచాయతీ, మండలంలో ఉమ్మడి పోరాటం చేస్తామని టీడీపీ, జనసేన మండల, పట్టణ నాయకులు ఎంవీ.శేషయ్య, మాధవ, హరికృష్ణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి సూచనలతో బుధవారం వారు స్థాని టీడీపీ కార్యాలయంలో జనసేన, టీడీపీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నేతలు ఓ వలంటీర్‌ను ఎంఎల్‌వోగా నియమించి ఆయన ద్వారా వలంటీర్లతో టీడీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. చెన్నూరు రోడ్డులో ప్రైవేటు స్థలాల్లో నిర్మించిన డ్రైన్లు తొలగింపునకు హైకోర్టు ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తూ స్థల యజమానులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బుచ్చి బైపాస్‌రోడ్డులో వేస్తున్న సిమెంటు రోడ్డు నాశిరకంగా వేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్పడుతున్న తప్పుడు విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు హరనాథ్, రామానాయుడు, కొండయ్య ప్రభాకర్‌రెడ్డి, ఉసురుపాటి, కిషోర్, బాలాకుమార్, దశరథ, సుబ్బారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు

టూరిజం హోటళ్ల ప్రైవేటీకరణ ఆపండి

కోవూరు, జనవరి 31: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ టూరిజం హోటళ్ల ప్రైవేటీకరణ చేయడాన్ని ఆపాలని ఏపీ టూరిజం కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తురకా శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టూరిజం అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న యూనిట్లను, హోటళ్లను ఈ టెండర్ నోటిఫికేషన్ ద్వారా ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అదే జరిగితే రాష్ట్రంలో సుమారు 1500 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగభద్రతను కోల్పోతారన్నారు. ప్రైవేటీకరణ చేయవద్దని తమ సంఘం ఆధ్వర్యంలలో ఇటీవల విజయవాడలో సంస్థ చైర్మన్ వరప్రసాద్ రెడ్డికి విన్నవించుకున్నట్లు తెలిపారు. ఈ ఆలోచనను మానుకుని తమకు ఉపాధి కల్పించాలని కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే

● మాజీ మంత్రి నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 31 : వైసీపీ నియంతృత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 51వ డివిజన్‌లో బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కనకమహల్ సెంటర్ నుంచి బోసుబొమ్మ వరకు ఉన్న ప్రతి దుకాణానికి, ఇంటికి నారాయణ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో సుపరిపాలన అందిస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నెల్లూరులో చేసిందేమీ లేదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడే ఎమ్మెల్యేకు నగరంలో సీటే లేకుండా పోయిందని అనిల్‌ను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, 51వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రశాంత్, యూనిట్ ఇన్‌చార్జి వాసు, డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్, ఖయ్యూం, రాజేష్, సందేష్, బున్నీ, భాస్కర్, నన్నేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణను సన్మానిస్తున్న స్థానికులు, పక్కన కోటంరెడ్డి

జగన్ .... స్టాలిన్‌ను చూసి నేర్చుకో!

నెల్లూరు (వైద్యం), జనవరి 31 : తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను చూసి ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం నగరంలోని 47వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా ఈ సారి టీడీపీకి ఓటేస్తామని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజలు భరోసా ఇస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధరలు విపరీతంగా పెరిగాయని, వ్యాపారులు కూడా ప్రశాంతంగా వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, రాజానాయుడు, విజేతరెడ్డి, గణేష్, చెంగయ్య ఆచారి, భాస్కర్, పెంచలయ్య, రెహమాన్, రాజా, పద్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఎల్‌సీ రమణారెడ్డి

నెల్లూరు (విద్య), జనవరి 31 : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసిన జిల్లావాసి ఎల్‌సీ రమణారెడ్డి టీడీపీలో చేరారు. హైదారాబాద్‌లోని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా శ్రమిస్తానని చెప్పారు. కాగా, రమణారెడ్డి పార్టీలో చేరడంపై పలువురు ఉపాధ్యాయులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ముంగమూరుకు ఘన నివాళి

నెల్లూరు (వైద్యం), జనవరి 31 : దివంగత మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణా రెడ్డి ప్రజానాయకుడడని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ కొనియాడారు. బుధవారం ముంగమూరు వర్ధంతి సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ శ్రీధర్‌కృష్ణారెడ్డి మృతి టీడీపీకి తీరని లోటన్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద వేణు, సుబ్బు వారి స్నేహితులు అన్నదానం చేశారు. పేదలకు దుప్పట్లు పంచారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక అనూరాధ, తిరుమల నాయుడు, కువ్వారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేస్తున్నారనే
నారాయణపై అవాస్తవ ప్రచారం

● నారాయణ విద్యా సంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 31 : మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ఆయన మీద పోటీ చేసి గెలవలేమనే కొందరు ఆయనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నారాయణ విద్యా సంస్థలపై అభియోగాలు చేస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారన్నారు. ఓటర్ల వ్యక్తిగత డేటాని తాము సేకరిస్తున్నట్లు, వారిని ప్రలోభపెట్టి, మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపణలు చేశారన్నారు. నారాయణ విద్యా సంస్థలు ఎప్పుడూ అలాంటి డేటాను సేకరించవని, తమ వెబ్‌సైట్‌లో విద్యార్థుల వివరాలు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చైల్డ్ ఇన్ఫో మాదిరిగానే, కేంద్ర ప్రభుత్వ యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం విద్యార్థుల వివరాలను అప్డేట్ చేస్తున్నామని చెప్పారు. అప్పిరెడ్డి ఆరోపణలు సత్యదూరమన్నారు. కులగణన పేరుతో వలంటీర్లే ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారని విజయభాస్కర్‌రెడ్డి ఆరోపించారు. అసత్య ఆరోపణలు చేసిన అప్పిరెడ్డిపై ఎలక్షన్ అథారిటీ నుంచి వచ్చే వివరాల ఆధారంగా న్యాయపరంగా ముందుకెళతామని తెలిపారు.



మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

ప్రజల నడ్డి విరుస్తున్న వైసీపీ ప్రభుత్వం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నెత్తిన మోయలేని భారాలు మోపుతూ వారి నడ్డి విరుస్తోందని జనసేన పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆరోపించారు. నగరంలోని 11వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్‌లో బుధవారం జనం కోసం జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ల పరిపాలనలో పూర్తి స్థాయిలో వైఫల్యం చెందిందన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు జనసేన-టీడీపీ కూటమిని గెలిపించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ అలియా, సత్యసాయి, అలహరి జీవన్, పవన్ యాదవ్, అజయ్‌బాబు పాల్గొన్నారు.



మహిళకు అభివాదం చేస్తున్న సుజయ్

సాహిత్య సేవా పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 31 : నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం రచయిత పంచాగ్నుల విశ్వేశ్వర శర్మ స్మారక సాహిత్య పురస్కారాల ప్రదానం ఘనంగా జరిగింది. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వేశ్వర శర్మ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఆయన రచనలను, సాహిత్య కోణాలను విశ్లేషించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ ఉషాకిరణ్ అతిథిగా హాజరై రాచపాలెం రఘు, జంధ్యం కోదండరామయ్యకు సాహితీ రత్న, డాక్టర్ చీదరాల చెన్నయ్య, దూబిశెట్టి కల్యాణికి సేవారత్న అవార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కే మురళీమోహన్‌రాజు, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, బొనిగి ఆనందయ్య, ఎన్ బలరామయ్య నాయుడు పాల్గొన్నారు.

రంగడి ఆలయంలో లీజు హక్కుల బహిరంగ వేలం

● రూ.10.62లక్షల ఆదాయం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం తాత్కాలిక లీజు హక్కులకు బహిరంగ వేలం పాటలు జరిగాయి. ఆలయంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు, ఫొటోలు, పుస్తకాలు విక్రయించుకునే హక్కు, చెప్పులు భద్రపరుచుకునే హక్కు, కల్యాణ మండపంలో వివాహాది శుభకార్యాలకు లైటింగ్ డెకరేషన్ చేసుకునే హక్కు, ఆ మండపానికి హైరర్స్ సప్లై చేసుకునే హక్కు, పూల డెకరేషన్ చేసుకునే హక్కులతోపాటు స్వామివారికి భక్తులు సమర్పించే వస్త్రాలు సేకరించుకు నే హక్కులకు వేలం పాటలు జరిగాయి. వీటి ద్వారా ఆలయానికి రూ.10,62,000 ఆదాయం వచ్చింది. గత సంవత్సరం ఇదే వేలంపాటలకు రూ.8,69,000 ఆదాయంరాగా, ఈ సారి సుమారు రెండు లక్షల ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నన్ను గెలిపించండి : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, జనవరి 31 : ఈసారి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నా, నన్ను గెలిపించండి, చంద్రబాబును సీఎం చేద్దాం రండి అంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఒక్కడినే ఒంటరిగా కార్యక్రమంలో భాగంగా బుధవారం డ్రైనేజీ ఈఈ కార్యాలయంలో పలువురు ఉద్యోగులను పలకరించి మాట్లాడారు. చంద్రబాబు సీఎం అయితే తప్ప రాష్ట్రం బాగుపడదన్నారు. కాగా, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు వెలగ చెట్టు సెంటరు, అపోలో ఆసుపత్రి కూడలి, శ్రామికనగర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు.



కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

టీడీపీలోకి భారీగా చేరికలు

కొత్తూరు వద్దనున్న ట్రైలర్స్ కాలనీలో బుధవారం భారీ సంఖ్యలో స్థానికులు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కరిముల్లా, గౌష్‌బాషా, ఖాదర్‌బాషా, హరినాయుడు మిత్రబృందాలు టీడీపీ కండువా కప్పుకున్నాయి. అన్ని వర్గాల ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత ఉందని కోటంరెడ్డి సోదరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి రఘు, బత్తల కృష్ణ, హరియాదవ్, యానదయ్య, మస్తాన్ నాయుడు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సదస్సు

నెల్లూరు (విద్య), జనవరి 31 : నగరంలోని వెంగళరావునగర్ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాలికా విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సుజాత మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల బాలికలు తీవ్రంగా నష్టపోతారని, మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు పీ శోభన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, డాక్టర్ పీ రీనాకుమారి, జీ మాధవరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ గంగాధర్ సేవలు అభినందనీయం

నెల్లూరు (వైద్యం) జనవరి 31 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యుడు గంగాధర్ సేవలు అభినందనీయమని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ కొనియాడారు. గంగాధర్ జిల్లా అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయనను బుధవారం జీజీహెచ్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్‌బాషా, యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు కమ్మటి శ్రీనివాసులు, షేక్ సందానీబాషా, సురేంద్ర, సామెల్, రామరాజులు, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు (వైద్యం), జనవరి 31 : ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మొహమ్మద్ ఖలీల్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని చాకలి వీధిలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మందులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం ఇంటింటికి అందించాలన్న ఉద్దేశంతో సురక్ష కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వైద్యాధికారి డాక్టర్ గీతాంజలి, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

వైసీపీ నగర చైర్మన్‌గా సన్నపురెడ్డి

● 28 మందితో కమిటీ

నెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల దృష్ట్యా వైసీపీ నెల్లూరు నగర కమిటీని పార్టీ అధిష్ఠానం నియమించింది. మొత్తం 28 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీకి సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డిని చైర్మన్‌గా నియమించింది. ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులతో కూడిన ఈ కమిటీలో నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నాయకులను సభ్యులుగా నియమించారు.

ఎస్ఈ హరినారాయణరెడ్డికి ఘన సన్మానం


నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 : జలవనరుల శాఖ ఎస్ఈ హరినారాయణరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మం వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. హరినారాయణరెడ్డి సేవలను వక్తలు కొనియాడా రు. నెల్లూరు - రాయలసీమ జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించిన అపర భగీరథుడని కీర్తించారు. కండలేరు జలాశయంలో 60 టీఎంసీల కంటే అధికంగా నీరు నిల్వచేయడంతో ఆయన రికార్డు సాధించారన్నారు. అనంతరం డీఈలు, ఏఈలు, సిబ్బంది, జిల్లా రైతాంగం హరినారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు.

రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయండి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 : విజయవాడ కార్మికశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని వ్యాపార దుకాణాలు, సంస్థలు రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ చేయించాలని జిల్లా కార్మిక అధికారి ఎం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను గ్రామ సచివాలయాల్లో గానీ, సేవా కేంద్రాలయాల్లో గాని ఫిబ్రవరి ఆఖరులోపు చేసుకోవాలని కోరారు.

నేడు జొన్నవాడకు భువనేశ్వరి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 31: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయాన్ని గురువారం మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి సందర్శించనున్నారు. మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకుంటారని స్థానిక టీడీపీ నాయకుడు గొల్లనపల్లి ఉమ్మయ్యస్వామి తెలిపారు.



అమ్మ కల నెరవేరిన క్షణం

తిరుపతి జిల్లా కలెక్టర్‌గా తల్లిదండ్రుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా



"శ్రీవారి ఆశీస్సులతో, తల్లిదండ్రుల, గురువుల, పెద్దల ఆశీర్వాదాలతో బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు సంతోషంగా ఉంది. తిరుపతి చారిత్రాత్మక జిల్లా. ఆధ్యాత్మికంగానూ, మతపరంగానూ, అభివృద్ధిపరంగానూ రాష్ట్రంలో ప్రముఖమైనది. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సహకారంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ తిరుపతిని ఉత్తమ జిల్లాగా నిలబెట్టడానికి కృషి చేస్తా.ఏ ఐఏఎస్ అధికారి కెరీర్‌లో అయినా ఎన్నికల్లో పనిచేయడమనేది అతి ముఖ్యమైన సందర్భం. ఈ అవకాశాన్ని ఛాలెంజిగా స్వీకరిస్తున్నాను. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల అధికారుల మార్గదర్శకాలను, ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తా. జిల్లా నలుమూలలా ఏం జరుగుతోందో తెలుసుకోవడం నా ఒక్కడివల్లే సాధ్యం కాదు. మీడియానే కళ్ళూ, చెవులుగా పరిగణిస్తాను."

అమ్మ కల నెరవేరిన ఆ క్షణం.. అపురూపమైనది. ఆనందం అర్ణవమై.. ఆ తల్లి కనుకొలకుల్లో నీళ్ల తొణికిసలాడిన ఆ దృశ్యం.. జిల్లా కలెక్టరేట్‌లో అందరి మనసులనూ తడి చేసింది. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేయగానే లక్ష్మీశాను ఆయన తల్లి లక్ష్మమ్మ హత్తుకుని, అల్లుకుని మాటలు పెగలని ఆనందం ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లాలో మారుమూలన ఉండే హోలుగుండనపల్లెలో నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టి పెరిగిన లక్ష్మీశా 2013లో ఐఏఎస్ సాధించినా జిల్లా కలెక్టర్‌గా ఇది ఆయన తొలి పోస్టింగ్. కర్నూలు జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా ప్రొబేషన్ పూర్తి చేసుకున్న ఆయన నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత పార్వతీపురం ఐటీడీఏ పీవోగా, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అటు తర్వాత ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమితులయ్యారు. ఎన్ని బాధ్యతలు నిర్వహించినా ఐఏఎస్ సాధించినవారి జీవితంలో కలెక్టర్ హోదా అన్నది ప్రత్యేకమైనది. పేద తల్లిదండ్రులు ఎదురుచూసిన ఈ ప్రత్యేక సందర్భాన్ని లక్ష్మీశా తన కుటుంబం మొత్తంతో కలిసి బుధవారం సంతోషంగా పంచుకున్నారు. ఎన్నికల వేళ హఠాత్తుగా ఆయనను తిరుపతి కలెక్టర్‌గా బదిలీ చేశారు.కుటుంబసభ్యులందరితో కలిసి తిరుమల వెళ్లి బుధవారం వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాత సేవలో పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు.తర్వాత కలెక్టరేట్‌కు చేరుకుని తిరుపతి జిల్లా రెండవ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, డీఆర్వో పెంచల కిషోర్, డీపీవో బాలకొండయ్య, వివిధ శాఖల అధికారులు, లక్ష్మీశాకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కుటుంబంతో కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ వెళ్ళిన కలెక్టర్

కాగా బుధవారం జిల్లా పాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ లక్ష్మీశా అనంతరం కలెక్టర్ విజయవాడకు బయల్దేరి వెళ్ళారు. గురువారం అక్కడే వుంటారు.శుక్రవారం నుంచీ జిల్లాలో అధికార యంత్రాంగానికి, ప్రజలకు అందుబాటులో వుంటారు.



బాధ్యతల స్వీకరణ

అమ్మ మనసు ఉప్పొంగిన వేళ..

జిల్లా నూతన కలెక్టర్‌గా లక్ష్మీశా బాధ్యతలు చేపట్టి, అధికారుల నుంచీ అభినందనలు, శుభాకాంక్షలు స్వీకరించిన అనంతరం ఓ సాదాసీదా పల్లెటూరి తరహా వృద్ధ దంపతులు ఆయన్ను సమీపించారు. వారిలో వృద్ధ మహిళ ఒక్కసారిగా ఆయన్ను హత్తుకుపోయారు. చూస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులు అయోమయానికి గురయ్యారు. అర్జీ ఇచ్చేందుకు వచ్చిన వృద్ధురాలు కలెక్టర్‌ను ఆప్యాయంగా కలిసి ఆలింగనం చేసుకున్నట్టుగా అందరూ భావించారు. అయితే కలెక్టర్ ఆమెను తన తల్లి లక్ష్మమ్మగా అక్కడున్న అందరికీ పరిచయం చేశారు. దూరంగా నిలుచున్న తండ్రిని, భార్యను, ఇద్దరు పిల్లలను, సోదరుని, అత్తామామలను కూడా పిలిచి పక్కన నుంచోబెట్టుకున్నారు. వారందరినీ కూడా అధికారులకు, మీడియా ప్రతినిధులకు పరిచయం చేశారు.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆదిమూలం దెబ్బ

● గురుమూర్తి రీబ్యాక్ ● రాజేష్‌కు సత్యవేడు ఛాన్సు



గురుమూర్తి

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొట్టిన దెబ్బకు అధికార పార్టీ ఇంఛార్జుల జాబితా తారుమారైంది. బుధవారం ఆ పార్టీ విడుదల చేసిన ఐదవ జాబితాలో దాని ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఇంఛార్జిగా స్థానిక ఎంపీ గురుమూర్తిని ప్రకటించిన అధిష్ఠానం సత్యవేడుకు నూకతోటి రాజేష్‌ను ఇంఛార్జిగా నియమించింది. రాజేష్ మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సోదరి కుమారుడు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా తిరుపతి లోక్‌సభ స్థానానికి ఇంఛార్జిగా నియమిస్తూ గత 7వ తేదీన నాలుగో జాబితాలో అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలోనే సత్యవేడు ఇంఛార్జిగా తిరుపతి ఎంపీ గురుమూర్తిని ప్రకటించింది. ఆ జాబితా కారణంగా జిల్లా వైసీపీలో ముసలం పుట్టినట్టయింది.తిరుపతి ఎంపీగా పోటీ చేయడానికి ఇష్టపడని ఆదిమూలం ఆ విషయం అధినేతకు, మంత్రి పెద్దిరెడ్డికి పదేపదే చెప్పుకున్నా ఫలితం లేకపోయింది. నియోజకవర్గ వైసీపీలో వ్యతిరేక వర్గం ముందు తలెత్తుకోలేని పరిస్థితులు ఏర్పడడంతో ఎంపీ టికెట్ కంటే ఆత్మాభిమానమే ముఖ్యమని భావించిన ఆదిమూలం ఎంపీ టికెట్ తనకు వద్దని, అంతకు మించి దళితులకు గౌరవం ఇవ్వని పార్టీయే తనకు అవసరం లేదని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఆయన టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. ఈ పరిణామాలతో వైసీపీ అధిష్ఠానం షాక్‌కు గురైంది. తాజా జాబితాలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ ఇంఛార్జిగా తప్పించి తిరిగి తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా ప్రకటించారు. ఖాళీగా వున్న సత్యవేడుకు నూకతోటి రాజేష్‌ను నియమించారు. రాజేష్ మంత్రి పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడు. జీడీనెల్లూరులో అవకాశం కల్పించాలని ఎంత ప్రయత్నించినా సమీకరణల కారణంగా వీలు కాలేదు. జీడీనెల్లూరు నుంచీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని తప్పించి అక్కడ రాజేష్‌ను ఇంఛార్జిగా నియమించాలన్న ప్రయత్నాలు బలంగా జరిగాయి. అయితే నారాయణస్వామి అధినేత ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో మనసు మార్చుకున్న అధినేత చిత్తూరులో ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా వేశారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను అనివార్యంగా జీడీనెల్లూరు అసెంబ్లీకి బదిలీ చేయాల్సి వచ్చింది. దీంతో రాజేష్‌కు అవకాశం కల్పించలేకపోయారు. అయితే ఆదిమూలం పార్టీని వీడడంతో అనూహ్యంగా రాజేష్‌కు అవకాశం దక్కింది. గెలుపోటముల సంగతి పక్కనపెడితే ఈ దఫా టికెట్ దక్కదని తీర్మానించుకున్న రాజేష్‌కు అదృష్టం తలుపు తట్టింది. మరోవైపు తిరుపతి నుంచీ సత్యవేడుకు, మళ్ళీ సత్యవేడు నుంచీ తిరుపతికి బంతిలా అటూఇటూ దొర్లిన గురుమూర్తి సైతం తీవ్ర ఆవేదనతో వున్నట్టు సమాచారం. మొత్తానికి కోనేటి ఆదిమూలం తీసుకున్న నిర్ణయం వైసీపీలో అనేక మార్పుచేర్పులకు కారణమవుతోంది.



రాజేష్

చెవిరెడ్డికి వైసీపీలో మరిన్ని బాధ్యతలు



చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి తాజాగా వైసీపీలో మరిన్ని అదనపు బాధ్యతలు మీద పడ్డాయి. ఇప్పటికే పార్టీ అనుబంధ విభాగాల ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న ఆయన కొంతకాలంగా పూర్తి సమయం పార్టీ అధినేత జగన్‌కు అందుబాటులో వుంటూ పార్టీ సర్వేల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనను ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నియామకంతో ఒంగోలు ఎంపీ టికెట్ ఆయనకే కేటాయించే అవకాశముందని జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. అనూహ్య పరిణామాలు ఎదురైతే తప్ప ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ఆయనే బరిలోకి దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31: జిల్లాలో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు.ఇతర జిల్లాల నుంచీ కొంతమంది బదిలీపై మన జిల్లాకు రానున్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా నియమించారు. కేఆర్ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ భవాని శంకరిని నూజివీడు ఆర్డీవోగా, వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులును తెలుగుగంగ ప్రాజెక్టు నెల్లూరుజిల్లా రాపూరుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న దేవేంద్రరెడ్డిని జిల్లా వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. నగరి ఆర్డీవో సుజనను తుడా భూసేకరణ అధికారిగా నియమించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన రామ్మోహన్‌ను తిరుపతి జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. వరదయ్యపాళెం తహసీల్దారుగా పనిచేస్తున్న గౌరీశంకరరావు పదోన్నతిపై అనంతపురం, హిందుపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎల్ఎన్ రెడ్డి బదిలీ

- తిరుపతికి రానున్న ఆరుగురు సీఐలు
- ఇద్దరు సీఐలు రెగ్యులర్ ప్రాతిపదికన ప్రస్తుత స్థానాల్లోనే

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: తిరుపతి జిల్లా ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎల్ఎన్ రెడ్డి బదిలీ అయ్యారు. అలాగే నూతనంగా ఆరుగురు సీఐలు బదిలీపై తిరుపతికి రానున్నారు. మరో ఇద్దరు సీఐలు ప్రస్తుతమున్న స్థానాల్లోనే రెగ్యులర్ ప్రాతిపదికన కొనసాగనున్నారు. ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎల్ఎన్ రెడ్డి అనంతపురం ఏఆర్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. ఇక ఇప్పటికే అనంతపురం రేంజిలో వీఆర్‌లో ఉన్న సీఐలు శ్రీరాముడును తిరుపతి ట్రాఫిక్ సీఐగా నియమించారు. జి. విజయ్‌కుమార్‌ను తిరుమల వన్‌టౌన్ సీఐగా, బి. శ్రీకాంత్‌రెడ్డిని తిరుచానూరు సీఐగా బదిలీ చేశారు. తమీమ్ అహ్మద్‌ను తిరుపతి రూరల్ సీఐగా, ఎం. రామయ్యను చంద్రగిరి సీఐగా, జి. మురళీకృష్ణను తిరుపతి సీసీఎస్ సీఐగా నియమించారు.ప్రస్తుతం తాత్కాలికంగా శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న ఎస్వీ నరసింహారావును అదేస్థానంలో రెగ్యులర్ ప్రాతిపదికన నియమించారు. పుత్తూరు సీఐ జి. ఓబులేసును కూడా అదే స్థానంలో రెగ్యులర్ ప్రాతిపదికన కొనసాగిస్తూ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

పలువురు తహసిల్దార్లకు స్థానచలనం

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్ళు పైబడి జిల్లాలో కొనసాగుతున్న తహసిల్దార్లను బదిలీ చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా 36మంది తహసిల్దార్లు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు.అదే సమయంలో ఇతర జిల్లాల నుంచీ ఇక్కడికి 32 మంది బదిలీపై రానున్నారు. కాగా జిల్లాలో మూడేళ్ళ సర్వీసు పూర్తి కాని వారు, అలాగే మరో ఆరు నెలల్లో రిటైరు కానున్న వారు కలిపి ఐదుగురు తహసిల్దార్లకు బదిలీల నుంచీ ఈసీ మినహాయింపు ఇచ్చింది. బయటి జిల్లాల నుంచీ వచ్చే తహసిల్దార్లకు చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల పరిధిలో చిత్తూరు కలెక్టర్, వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో నెల్లూరు కలెక్టర్ మండలాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ కసరత్తు పూర్తి కానుంది.

జిల్లానుంచీ 36 మంది బదిలీ

కె.కుప్పయ్య (కలెక్టరేట్‌లో ప్రోటోకాల్ సెక్షన్), పి.భారతి (కలెక్టరేట్), వీఎస్‌వీఆర్ కృష్ణ (డక్కిలి), ఎం.రోశయ్య (నాయుడుపేట),ఎస్.శివప్రసాద్ (ఏర్పేడు), యు.మధుసూదన రావు (పిచ్చాటూరు), ప్రమీల (నారాయణవనం), వెంకట్రమణ, (తిరుపతి అర్బన్), శిరీష (చంద్రగిరి), కేపీ భాగ్యలక్ష్మి (పాకాల), ఐ.సుబ్రమణ్యం (వడమాలపేట), వై.రమేష్‌బాబు, ఆర్.వెంకటలక్ష్మమ్మ (ఎండోమెంట్స్, తిరుపతి) కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఝూన్సీలక్ష్మి, (ఆర్డీవో కార్యాలయ ఏవో, శ్రీకాళహస్తి), వి.ఉదయ్ సంతోష్ (రేణిగుంట) కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎం.హనుమంతు నాయక్ (బాలాయపల్లి), జె.నిత్యానందబాబు (తొట్టంబేడు), సి.శ్రీదేవి (కేవీబీపురం), టీపీ సుబ్రమణ్యం (తిరుపతి రూరల్), జె.పరమేశ్వరస్వామి (పుత్తూరు), దస్తగిరయ్య (ఎర్రావారిపాలెం), లోకేశ్వరి (చిన్నగొట్టిగల్లు) అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్ళారు. ఎం.భార్గవి (బీఎన్ కండ్రిగ), జీసీ వెంకటేశ్వర్లు (ఆర్‌సీపురం) నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. బి.లీలారాణి (గూడూరు),ఎ.పద్మావతి (కోట), బి.పద్మావతి (వెంకటగిరి), రామకృష్ణ శివప్రసాద్ (దొరవారిసత్రం), రవికుమార్ (సూళ్ళూరుపేట), రామయ్య (పెళ్ళకూరు), ఎస్.చంద్రశేఖర్ (కలెక్టరేట్) ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. షేక్ జరీనా (సత్యవేడు) అన్నమయ్య జిల్లాకు, మునిలక్ష్మి (చిల్లకూరు) బాపట్ల జిల్లాకు, గీతావాణి (సూళ్ళూరుపేట ఆర్డీవో ఆఫీసు ఏవో) పల్నాడు జిల్లాకు బదిలీ కాగా మస్తానయ్య (చిట్టమూరు), జయజయరావు (తడ)లను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు.

బయటి నుంచీ 32మంది రాక

అనంతపురం జిల్లా నుంచీ ఉషారాణి, ఎం.బాలకృష్ణ, జి.మారుతి, బి.వాణిశ్రీ బదిలీపై జిల్లాకు రానున్నారు.నంద్యాల జిల్లా నుంచీ కె.నరసింహారావు, కర్నూలు జిల్లా నుంచీ కె.శ్రీనివాస గౌడ్, డి.హుస్సేన్ సాహెబ్, కె.రామంజనేయులు, కడప జిల్లా నుంచీ పి.శరత్, ఎం.శ్రీవాణి, వి.గంగయ్య, ఎ.నాగేశ్వరరావు, వి.రాజసింహ నరేంద్ర, పీఎండీ అలీఖాన్, డి.ఉదయ భాస్కర రాజు, శంకర్ రావు, ఏవీఎస్ నారాయణరెడ్డి, వై.ఉదయభారతి, బి.లక్ష్మీదేవి, బి.శ్రీధర్ రావు, అన్నమయ్య జిల్లా నుంచీ ఎం.శ్రీరాములు నాయక్, మహబూబ్ చాంద్, చిత్తూరు జిల్లా నుంచీ నరసింహులు,గుంటూరు జిల్లా నుంచీ కె.సాంబశివరావు, జి.నాంచారయ్య, కె.శ్రీనివాస శర్మ, కె.కళ్యాణి, జి.కరుణకుమార్, బీవీఆర్ సీహెచ్ ప్రసాద్, కె.పుల్లారావు, జి.శ్రీనివాస్, డి.నాగరాజరావు బదిలీపై మన జిల్లాకు రానున్నారు.

ఐదుగురికి బదిలీల నుంచీ మినహాయింపు

జిల్లాలో మూడేళ్ళ సర్వీసు పూర్తికాని కారణంగా తిరుపతి కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్లు కె.జనార్ధన రాజు, కేవీఆర్వీ ప్రసాదరావు, శ్రీకాళహస్తి తహసిల్దారు ఎస్.ద్వారకనాథరెడ్డి, వాకాడు తహసిల్దారు నరసింహారావు, జూన్‌లోపు రిటైరు కానున్న నాగలాపురం తహసిల్దారు ఎ.ప్రసన్న కుమార్‌కు బదిలీల నుంచీ ఎన్నికల కమిషన్ మినహాయింపు ఇచ్చింది.

బ్రహ్మానందానికి సైకత శుభాకాంక్షలు



చిల్లకూరు, జనవరి 31: సినీనటుడు బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా బుధవారం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ గ్రామ సమీపంలోని సముద్రతీర ప్రాంతంలో బ్రహ్మానందం సైకతశిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ హాస్యనటుడిగా ఐదు నంది అవార్డులు, ఒక ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్న ఆయనకు సైకతశిల్పం ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం: నెలవల



సదస్సులో మాట్లాడుతున్న నెలవల

ఓజిలి, జనవరి 31: ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించి బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకువస్తే... చంద్రబాబునాయుడు సామాజిక, ఆర్థికాభివృద్ధిలో నడిపించాడని సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెవల సుబ్రహ్మణ్యం అన్నారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు బుధవారం ఓజిలిలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బడుగులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసిందని విమర్శించారు. టీడీపీ బీసీలకు పెద్దపీట వేసిందని వారిని అన్ని విధాలా ఆదుకుందని, కార్పొరేషను ఏర్పాటుతో పాటు ఆదరణ వంటి పథకాలతో 90 శాతం రాయితీ కింద వివిధ పరికరాలు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. గడచిన నాలుగన్నరేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనతో తీవ్ర ఇబ్బందులు పడ్డ బీసీలు ఏకతాటిపైకి రావడం శుభపరిణామం అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, రాష్ట్ర కార్యదర్శి మల్లి మునుస్వామి, మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంకాయల వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్కే ఖలీల్, సుధీర్, సతీష్‌చంద్ర, కార్తీక్‌రాజు, పురుషోత్తంరాజు, సుబ్రహ్మణ్యంరాజు, చింతల సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన దుగరాజపట్నంవాసులతో సునీల్‌కుమార్

వాకాడు, జనవరి 31: మండలంలోని దుగరాజపట్నం పంచాయతీలోని అంజలాపురం, కొండూరుపాళెం, కాశీవాకం, పులింజరిపాళెం, దర్గామిట్ట గ్రామాలకు చెందిన 200 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. ఆవుల రాము, చంద్రకాంత్, జయరామయ్య, మీరయ్య, కొమ్మయ్య, బాబు ఆధ్వర్యంలో దుగరాజపట్నం మాజీ సర్పంచు దోసకాయల కృష్ణమూర్తి నాయకత్వంలో టీడీపీలో చేరారు. వారికి గూడూరు ఇన్‌చార్జి పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, తుమ్మల మోహన్‌నాయుడు, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, కోటా శ్రీనివాసులు, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, చిరంజీవమ్మ, తీపలపూడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని తిరువెంగాలాయపల్లెకు చెందిన వంద కుటుంబాల వైసీపీ కార్యకర్తలు చేవూరు సురేంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికీ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా కోట మండలంల కర్లపూడి గ్రామానికి చెందిన కొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, సర్వోత్తమరెడ్డి, జలీల్‌అహ్మద్, రాధాకృష్ణరెడ్డి, నాగేశ్వరరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు స్పందన కరువు



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

కోట, జనవరి 31: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. అధికార పార్టీకి చెందిన ముగ్గురు నాయకులు మాత్రమే పలు సమస్యలపై అర్జీలను అధికారులకు ఇచ్చారు. అలాగే స్థానికులు కొందరు సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య, ఎంపీడీవో భవానీ, తహసీల్దారు పద్మావతి, డీఎల్‌పీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



అల్లూరు సీతారామరాజు విగ్రహాన్ని ప్రారంభిస్తున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 31: విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో మెలిగి శ్రద్ధగా చదువుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో 'అమృత మహోత్సవం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన అల్లూరు సీతారామ రాజు, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోష్, భరతమాత, భగత్ సింగ్ విగ్రహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసి జ్యోతి, సిబ్బంది హరీష్, సుబ్బయ్య, ముజీబ్, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



సుబ్రహ్మణ్యం దంపతులను అభినందిస్తున్న డాక్టర్ మైథిలి, రమణబాబు

కోట, జనవరి 31: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంఈవోలు, ఉపాధ్యాయులు అన్నారు. కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన నెల్లూరు సుబ్రహ్మణ్యం సన్మాన సభ బుధవారం జరిగింది. సుబ్రహ్మణ్యం, సుమతి దంపతులను పలువురు ఎంఈవోలు, ఉపాధ్యాయులు శాలువాలు, మెమొంటోలతో అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ మైథిలి, రమణబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం

వాకాడు, జనవరి 31: వాకాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ చేసిన రెడ్డి నిర్మలకుమారిని ఎంఈవోలు నసీం ఆలీ, బాబు, సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, బంధుమిత్రులు, బీటీఏ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో అభివృద్ధి

గూడూరు, జనవరి 31: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక ఒకటో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేసేలా మినీ మెనిఫెస్టోను రూపొందించడం జరిగిందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, గోను శివకుమార్, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, సుప్రజ, సుధ, విజయమ్మ, గురవయ్య, లక్ష్మి, రేవతి జనార్దన రెడ్డి, ఆడపాల శివ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న సంధ్యారాణి





తవ్వకాలను అడ్డుకుంటున్న రోసనూరు గ్రామస్తులు, టీడీపీ నేత రాజేంద్ర - పోలీసులతో మాట్లాడుతున్న స్థానికులు

ఆగని గ్రావెల్ దందా

- హైవే పనుల ముసుగులో లే అవుట్లకు తరలింపు
- అడ్డుకున్న రోసనూరు గ్రామస్తులు, టీడీపీ నేతలు
- ఫోన్‌లో ఎన్డీసీసీబీ ఛైర్మన్ బెదిరింపులు

పెళ్లకూరు, జనవరి 31: పెళ్లకూరు మండలంలో ఆగని గ్రావెల్ దందా అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల ముసుగులో రేయంబవళ్లు రియల్ ఎస్టేట్ భూములకు తరలిస్తున్నారు. తాజాగా మండలంలోని రోసనూరు ప్రాంతంలోని ప్రభుత్వ భూములను తవ్వి తరలిస్తుండడంతో స్థానికులు, నాయుడుపేటకు చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దార్ల రాజేంద్ర తదితరులు అడ్డుకున్నారు. వారిని వైసీపీ నేత ఫోన్లో బెదిరించిన ఘటన బుధవారం వెలుగుచూసింది. మండలంలోని శిరసనంబేడు, నందిమాల, చెన్నప్పనాయుడుపేట, బంగారంపేట తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల నుంచి నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం అంటూ వైసీపీలోని ఓ వర్గం నేతల కనుసన్నల్లో గ్రావెల్ తవ్వుతున్నారు. నాయుడుపేటలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ప్రతిరోజు వందలాది టిప్పర్లు తరలిస్తుండడంతో గ్రామస్తులంతా ఏకమై అడ్డుకోవడంతో ఆయా గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలను నిలిపివేశారు. మళ్లీ వారం రోజుల నుంచి వైసీపీలోని మరో వర్గం రోసనూరు పంచాయతీ పరిధిలోని భూముల్లో గ్రావెల్ తవ్వకాలను ప్రారంభించారు. దీంతో బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఓ గ్రామస్థుడికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న నాయుడుపేట సీఐ జగన్మోహన్‌రావు, పెళ్లకూరు ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి వివాదాలు లేకుండా సర్దుబాటు చేసినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య విభేదాలే ఈ వివాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం: కురుగొండ్ల

వెంకటగిరి, జనవరి 31: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఆర్ఎల్ కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా దివంగత నేత ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని స్థాపించారని కొనియాడారు. ఆ మహనీయుడి బాటలోనే చంద్రబాబు నడుస్తున్నారని చెప్పారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బీసీలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేసి, తప్పుడు కేసులు పెట్టి గొంతు నొక్కేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు కులవృత్తులను ప్రోత్సహిస్తూ రాయితీలు కల్పించి బీసీల ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ గత ప్రభుత్వం అమలు చేసిన రాయితీలను ఎత్తివేసి బీసీల కడుపు కొట్టారని విమర్శించారు. చంద్రబాబుతోనే రామరాజ్యం సాధ్యమని, రానున్న ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు తోట కృష్ణయ్య, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గంగోటి నాగేశ్వరావు, డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మునిస్వామి, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, బీరం రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, పవ్వు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, సామల చలపతి, జానపాటి బాలకృష్ణ, రుద్రాక్ష కౌశల్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



కుల వృత్తుల పరికరాలతో టీడీపీ నాయకులు

శ్మశానానికి దారి చూపండి

వాకాడు, జనవరి 31: మండలంలోని తిరుమూరు పంచాయతీ వావిళ్లపాళెం గిరిజన కాలనీలో బుధవారం సర్పంచు సిద్దపురెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా శ్మశానానికి దారి లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, దారి చూపాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కుల గురించి వివరించారు. రెవెన్యూ సినియర్ అసిస్టెంట్ సుధా మాట్లాడుతూ శ్మశానానికి దారి విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, వీఆర్వో హరిబాబు, సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్ బుజ్జమ్మ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట, జనవరి 31: నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా జనార్దనరెడ్డి, సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా చెల్లు గంగాప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వారికి ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.





బాధ్యతలు స్వీకరిస్తున్న జనార్ధనరెడ్డి, గంగాప్రసాద్

నరేంద్రకుమార్ సేవలు మరవలేనివి

సూళ్లూరుపేట, జనవరి 31: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్ సేవలు మరవలేనివని ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక స్త్రీ స్వశక్తి భవనంలో మున్సిపాలిటీ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బదిలీ వెళ్తున్న కమినర్ నరేంద్రకుమార్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన గంగాప్రసాద్‌కు ఆహ్వానం పలికారు. మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నల్లపరెడ్డి గోపాలరెడ్డికి నివాళి

కోట, జనవరి 31: కోటలో మాజీ సర్పంచు, సినీ నిర్మాత నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పట్టణంలో ఉన్న ఆయన విగ్రహానికి పార్టీలకు అతీతంగా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దాతృత్వంతో ఆర్డీవో కిరణ్‌కుమార్ చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డితో పాటు మధుసూదన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాయపు మణి, రామలింగారెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, మీజూరు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



గోపాలరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

కోట, జనవరి 31: ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఇంటి పన్నులు, క్యాష్‌వెట్ లావాదేవీలు, ఇంటి సర్వేలు, తదితర అంశాలపై సమీక్షించారు. సర్వే, పన్నుల వసూళ్లల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ విజయం తథ్యం

బాలాయపల్లి, జనవరి 31: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. బుధవారం బాలాయపల్లిలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంటా శ్రీనివాసులు రెడ్డి, రావణ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని 14వ వార్డులో చింతా మోహన్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు.

ఖేలో ఇండియా పోటీల్లో లక్ష్మీసిరి ప్రతిభ

గూడూరు, జనవరి 31: స్థానిక సొసైటీ కాలనీకి చెందిన దండు లక్ష్మీసిరి చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో టెన్నిస్ సింగిల్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. మాజీ కౌన్సిలర్ దండు మహేష్‌రెడ్డి కుమార్తె లక్ష్మీసిరి హైదరాబాదు తరఫున ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొంది.



సంప్రదాయ వంటలతో ఆరోగ్యం

నాయుడుపేట, జనవరి 31: సంప్రదాయ వంటకాలు ఎంతో రుచికరంగా ఉండడంతో పాటు ఆరోగ్యకరమని మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక అన్నారు. నాయుడుపేటలోని నారాయణ పాఠశాలలో బుధవారం మాస్టర్‌చెఫ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్‌లో రిజర్వేటివ్‌లు, టేస్టీసాల్ట్ వంటివి కలపడం ద్వారా నోటికి రుచిగా ఉన్నా ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. అమ్మచేతి వంటే ఆరోగ్యానికి శ్రేయస్సుకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం గురవయ్య, క్లస్టర్ ప్రిన్సిపాల్ రియాజ్, ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్‌బాషా, డీన్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ, షాజినా తదితరులు ఉన్నారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ తరగతులు

కోట, జనవరి 31: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు మూడు రోజులపాటు జరిగిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులమీదుగా గ్లోబల్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఉప్పలమర్తిలో భవిష్యత్ గ్యారెంటీ

చిట్టమూరు, జనవవరి 31: చిట్టమూరు మండలంలో ఉప్పలమర్తి గ్రామంలో బుధవారం టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు సునీల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, కస్తూరయ్య, చెంచురామయ్య ఆచారి, మణి, ముత్తు దేవుడు, అబ్దుల్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, జనవరి 31: పట్టణంలోని ఎల్‌ఏ సాగరం - బీడీకాలనీలో నివాసం ఉంటున్న రమణయ్య అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఓజిలి ఎంపీడీవో బదిలీ

ఓజిలి, జనవరి 31: ఓజిలి ఎంపీడీవో రజనీకాంత్ వైఎస్ఆర్ జిల్లా బద్వేలు మండలానికి బదిలీ అయ్యారు. బుధవారం ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ మోహన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

వెంకటగిరి టౌన్, జనవరి 31: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆసరా చెక్కులను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, జేఏసీ కన్వీనర్ ముళవాయి వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

సూళ్లూరుపేట, జనవరి 31: మండల పరిధిలోని అట్టకానితిప్ప గ్రామానికి చెందిన బాలకృష్ణ గ్రామంలో దారి ఆక్రమించాడని బుధవారం స్థానికులు తహసీల్దార్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ నడిబొడ్డులో ఉన్న దారిని బాలకృష్ణ ఆక్రమించి స్థానికులను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్

చిట్టమూరు, జనవరి 31: ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తిరుపతి, నెల్లూరు జిల్లాల ఏపీ ఫైబర్‌నెట్ కోఆర్డినేటర్లు నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం చిట్టమూరులోని స్త్రీసంక్షేమ భవనంలో జరిగిన ఫైబర్‌నెట్ వర్క్స్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు.

బెటాలియన్ సిబ్బందికి వీడ్కోలు

వెంకటగిరి టౌన్, జనవరి 31: మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో పనిస్తూ బదిలీ అయిన 24మందికి బుధవారం వీడ్కోలు పలికారు. కమాండెంట్ ప్రకాష్ మెమెంటోలు, డైరీలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మ్నెల్ మనోహర్, రామకృష్ణ, ఏవో చంద్రమౌళి, డాక్టర్ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతరలో దుకాణాల ఏర్పాటుకు వేలం

చిల్లకూరు, జనవరి 31: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 2నుంచి 5వ తేదీ వరకు ముత్యాలమ్మ జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయం చుట్టుపక్కల తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.10,30,000, దేవస్థానం ప్రాగణంలో పూలు, మాలలు విక్రయించుకునేందుకు రూ.55,000, పాదరక్షలు భద్రపరుచుకునేందుకు రూ.41,000, వేయికళ్ల కుండలు విక్రయించుకునేందుకు రూ.3,5,6000, అమ్మవారి ఫొటోలు, డాలర్లు, ధారాలు, తాయిత్తులు విక్రయించుకునేందుకు రూ.2,55,000కు హక్కులు దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ఛైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, బాలాజీ, విమల, ప్రభాకర్, సిబ్బంది సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కరీమ్‌కు సత్కారం

నాయుడుపేట, జనవరి 31: క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ షేక్ కరీమ్‌సాహెబ్ సేవలు అభినందనీయమని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ కరీమ్‌సాహెబ్ బుధవారం పదవీ విరమణ చేశారు. కరీమ్, సలీమా దంపతులను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలను కరీమ్ బృందం రికవరీ చేసిందన్నారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తరువాత కరీమ్ రెండు పర్యాయాలు ఉత్తమ అవార్డులు అందుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్కే షరీఫ్, ఎస్కే సిరాజ్, ఎస్కే నజీర్ తదితరులు పాల్గొన్నారు.



కరీమ్, సలీమా దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

పేదలకు అండగా జనసేన

చిల్లకూరు, జనవరి 31: పేదలకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక మిక్సిడ్ కాలనీలో జనం కోసం జనసేన, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, పరిమల సాయి, తిరుపాల్, హేమంత్, శశి, రాజ, వినోద్, సుబ్రమణ్యం, క్రాంతి, వసంత్ తేజ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

పాండురంగ స్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలు

సూళ్లూరుపేట, జనవరి 31: సూళ్లూరుపేట పట్టణంలోని రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయంలో బుధవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వేదపండితులు, మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మందిరిలో కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ఓలేటి బాలసత్యనారాయణ, ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, బాలాంజనేయస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో అలహాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ దారుణ హత్య

క్లీనర్ నిరంజన్‌ను అనుమానిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ తిరుపతిలో హత్యకు గురయ్యారు. బస్సు క్లీనర్ అదృశ్యం కావడంతో అతడే హత్యకు పాల్పడి వుంటాడని పోలీసులు భావిస్తున్నారు. అలహాబాద్‌కు చెందిన 55మంది యాత్రికులు తీర్థయాత్రకు తమ ప్రాంతానికే చెందిన ఓ ప్రైవేటు బస్సును అద్దెకు కుదుర్చుకున్నారు.చంద్రసేన్ తివారి (52) బస్సు డ్రైవర్ కాగా, నిరంజన్ క్లీనర్ (25). ఒడిశా రాష్ట్రంలో పర్యటన ముగించుకున్న యాత్రికులు మంగళవారం సాయంత్రానికి తిరుపతికి చేరుకున్నారు. యాత్రికులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లగా... పాత తిరుచానూరు రోడ్డులోని ప్రైవేటు బస్సుల పార్కింగ్ ప్రదేశంలో బస్సును పార్క్ చేసుకుని డ్రైవర్ చంద్రసేన్ తివారి, క్లీనర్ నిరంజన్ తిరుపతిలోనే ఉండిపోయారు. శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుంచి వచ్చిన యాత్రికులు చంద్రసేన్ తివారి హత్య విషయాన్ని గుర్తించారు. తల, ముఖంపై తీవ్రమైన గాయాలతో బస్సు సీటులో పడుకున్నవాడు పడుకున్నట్టే మృతిచెంది ఉండటాన్ని గుర్తించి స్థానికుల సాయంతో ఈస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.భక్తులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు, బస్సు యజమానికి సమాచారం తెలియజేశారు.క్లీనర్ నిరంజన్ కనిపించకపోగా అతడి సెల్‌ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ చేసి ఉండటంతో అతడే హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి తల, ముఖంపై ఉన్న బలమైన గాయాలను బట్టి జాకీరాడ్ లేదా మరేదైనా ఇనుప కడ్డీతో బలంగా కొట్టి హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లీనరే హత్య చేశాడా లేక మరెవరైనా చేశారా... హత్యకు కారణమేంటి అనే విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.



బస్సు డ్రైవర్ చంద్రసేన్ తివారి మృతదేహం